

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 83 పేజీలు: 8+16 వెల: 6.50



అధికార లాంఛనాలతో నాదెండ్ల అంత్యక్రియలు 3

వైస్ ఛాన్సలర్లు కూడా క్లాసులు బోధించాలి: గవర్నర్ 6


బెంగాల్ ఎన్నికల్లో బిజెపిదే విజయం

రెండో విడత ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

## మే 4న స్వీట్లు పంచుతాం 5



ట్రంప్ ట్రూత్‌పోస్టులో వెళ్లగక్కిన విద్వేషం

## భారత్, చైనాలు నరక కూపాలు! 5



# 100 రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు

మంత్రులు, ప్రజాప్రతినిధుల వేతనాల నుంచి 50 % సర్దుబాటు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలకవర్గాలు

గచ్చిబౌలి స్టేడియం పిపిపి పద్ధతిలో అభివృద్ధి

కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్23:** రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. గురువారం సాయంత్రం సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెవెన్యూ,గృహ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ కీలక నిర్ణయాలను వెల్లడించారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని >>2




గురువారం కేబినెట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి

## కాళేశ్వరంపై త్వరలో సిబిఐ డైరెక్టర్‌ను కలుస్తాం

కెసిఆర్, హరీష్‌రావు నిర్దోషులని హైకోర్టు ఎక్కడా చెప్పలేదు

జ్యుడీషియల్ కమిషన్ చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం: ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్23:** కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మంత్రివర్గం చర్చించింది. జ్యుడిషియల్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు తప్పుబట్టలేదు. కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుబట్టలేదు. జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమని, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడింది అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే కేవలం >>2



బెంగాల్‌లోని నందిగ్రామ్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

## ఓటెత్తిన బెంగాల్

రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 92 శాతం పోలింగ్

తమిళనాట కూడా రికార్డు స్థాయిలో 84 శాతం

బెంగాల్ పోలింగ్ హింసాత్మకం, బిజెపి అభ్యర్థులపై దాడి, వాహనాలు ధ్వంసం

పలుచోట్ల రాళ్లురువ్విన ఘటనలు, లాఠీఛార్జి

**కోల్‌కత్తా / చెన్నై, ఏప్రిల్ 23:** దేశంలోరెండురాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ఓటర్లు పోలింగ్‌కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమిళనాడులోని 234 స్థానాలకు ఒకే విడతగా జరిగిన ఎన్నికల్లో 84.51శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికలసంఘం ప్రకటించింది. సాయంత్రం ఆరు గంటలు దాటినప్పటికీ పోలింగ్‌కేంద్రాల్లో బారులు తీరి ఓటర్లు వేచి ఉండటం ఓటుహక్కు వినియోగంపై పెరిగిన అవగాహనకు నిదర్శనంగా తెలుస్తోంది. రెండురాష్ట్రాల్లోను రికార్డుస్థాయి >>2



నేటి నుంచి స్కూళ్లకు వేసవి

## సెలవులు

జూన్ 12న పునః ప్రారంభం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 23:** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలలకు నేటి(ఏప్రిల్ 24-శుక్రవారం) నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. గురువారం(ఏప్రిల్ 23)తో 2025-26 విద్యా సంవత్సరం పనిదినాలు ముగిశాయి. దీంతో నేటి నుంచి రాష్ట్రంలోని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. 2026-27 విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభం కానున్న నేపథ్యంలో 49 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. తిరిగి జూన్ 12న బడులు పునఃప్రారంభం >>2

# ప్రాణాలు తీసుకోకండి

తొందరపాటు నిర్ణయాలు వద్దు: ఆర్టీసీ కార్మికులకు సిఎం రేవంత్ హితవు


నేడు కార్మిక సంఘాలతో డిసిఎం భట్టి ఆధ్వర్యంలో చర్చలు

కార్మిక సోదరులు ఆత్మబలిదానాలు చేసుకోవద్దని మంత్రుల వినతి




గురువారం ఎంజిబిఎస్‌లో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ జెఎసి నాయకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్23:** ఆర్టీసీ సమ్మెపై శుక్రవారం కార్మికులతో మాట్లాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో చర్చలు జరపనుంది. గురువారం సాయంత్రం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో సమ్మెపై ప్రధానంగా చర్చ జరిగింది. నర్సంపేట, నల్గొండ ఘటనల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని కార్మికుల సమస్యలను >>2



డ్రైవర్ శంకర్‌గౌడ్

## నర్సంపేట డ్రైవర్ ఆత్మహత్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్23:** రెండు రోజులకే ఆర్టీసి కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. డిమాండ్ల సాధన కోసం ప్రాణాలు తీసుకునేందుకూ వెనుకాడట్లేదు. వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న కోలా శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడం కలకలం రేపింది. తీవ్రంగా గాయపడిన కోలా శంకర్ గౌడ్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శంకర్‌గౌడ్‌ను >>2



## ఇక కొత్త బీమా, బ్యాంకింగ్ పథకాలు

ఉద్యోగుల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత మరియు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త జీవిత బీమా, సమగ్ర బ్యాంకింగ్ పథకాన్ని ప్రారంభించిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు పెద్దపీట వేస్తూ, వారి కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం నింపేందుకు వన్‌స్టాప్ సొల్యూషన్ పథకం ఎంతగానో దోహదపడుతుందని ఈ మేరకు ఆయన గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఉద్యోగుల కోసం ఈ వన్ స్టాప్ సొల్యూషన్ పథకం ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ మరియు లోన్ సదుపాయాలను ఒకే చోట అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఇదొక గొప్ప వేదిక అని పేర్కొన్నారు. పథకం ద్వారా కలిగే >>2

అమెరికా మాటలు

## మేం నమ్మం

-పెజెష్కియాన్

14 నౌకలు వచ్చాయి, మరో 14 రావాలి: భారత్

సీఫైన్స్ తొలగింపునకు 6 నెలలుపైనే: పెంటగాన్



**టెహ్రాన్ / వాషింగ్టన్, ఏప్రిల్ 23:** అమెరికాతో యుద్ధం, చర్చల ప్రతిపాదనల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్‌మీడియా వేదికగా అగ్రరాజ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ చర్చలను, ఒప్పందాలను స్వాగతించిందని, ఎప్పటికీ స్వాగతిస్తుందని పేర్కొన్నారు. కానీ వాగ్దానాల ఉల్లంఘనను సహించేది లేదని పేర్కొన్నారు. మాట తప్పడం, దిగ్బంధనాలకు పాల్పడటం, బెదిరింపులకు గురి చేయడం వంటివి చర్చలకు అడ్డంకిగా మారుతాయని పేర్కొన్నారు. అమెరికా చెబుతున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదని అన్నారు. మీ కపటమైన డొల్ల మాటల తీరును ప్రపంచం గమనిస్తోందని అన్నారు. ఒకవైపు చర్చలు, సంప్రదింపులు అంటూనే మరోవైపు అమెరికా ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తోంది. హార్మూజ్ జలసంధి వద్ద బలగాలని >>7


వాట్సప్ యూనివర్సిటీ సమాచారం తీసుకోం 3

మేధావుల అభిప్రాయం గౌరవిస్తాం: సుప్రీం


# మే 4 నుండి హాజ్ యాత్ర

తెలంగాణ నుండి 6,660 మంది

యాత్రికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: మంత్రి అజారుద్దీన్



**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** హాజ్ యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. మే 4వ తేదీ నుంచి హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే సుమారు 10 వేల మంది హాజ్ యాత్రికులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో మంత్రి వసతి, రవాణా, విమానాశ్రయ కార్యకలాపాలు, ఆరోగ్య సేవలు, భద్రత, సామాను తరలింపు మరియు జమ్‌జమ్ పంపిణీని సమీక్షించారు. ఆర్జిఐఏ ప్రధాన టెర్మినల్లో, ముఖ్యంగా వజూ మరియు నమాజ్ ప్రాంతాలు, ఇమ్మిగ్రేషన్ కౌంటర్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉన్నత ప్రమాణాలను పాటించాలని విమానాశ్రయ అధికారులకు సూచించారు. హాజ్ చార్టర్ విమానాలు మే 4 నుండి మే 21 వరకు నడుస్తాయని చెప్పారు. మదీనా నుండి తిరుగు ప్రయాణ విమానాలు జూన్ 11 నుండి జూన్ 26 మధ్య షెడ్యూల్ చేయబడ్డాయన్నారు. హాజ్ హౌస్‌లో సౌకర్యవంతమైన బస సౌకర్యాలు, త్వరితగతిన డాక్యుమెంటేషన్, బోర్డింగ్ పాస్ సేవలు, వైద్య పరీక్షలు, >>2

# గొంతులోకి క'ల్తీ'

మొన్న నూనె, నిన్న మటన్, నేడు కల్తీ టీ పొడి

హైదరాబాద్‌లో పట్టుబడిన 4 టన్నుల కల్తీ పౌడర్, రసాయనాలు

అధిక లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం

పలు దుకాణాల్లో కల్తీ బ్రాండ్లే ఉన్నాయంటున్న అధికారులు



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో డిసిపి గైక్వాడ్

**హైదరాబాద్ (గన్‌ఫౌండ్రీ), ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఇటీవల వెలుగు చూస్తున్న వరుస కల్తీ ఉదంతాలు నగరవాసులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. నిన్న మటన్, మొన్న నూనె.. ఇలా రోజుకో కొత్త రూపంలో ప్రాణాంతక కల్తీ దందాలు బయటపడుతున్నాయి. తాజాగా భాగ్యనగరంలో మరో భారీ కల్తీ టీ పౌడర్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు.పోలీసులు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ నగరవ్యాప్తంగా 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించింది. కల్తీ టీ పొడిని తయారుచేస్తూ, విక్రయిస్తున్న తయారీ కేంద్రాలే లక్ష్యంగా సాగిన ఈ ఆపరేషన్‌లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అధిక లాభాల కోసం నిందితులు తక్కువ నాణ్యత గల టీ పొడికి కృత్రిమ రంగులు, గడువుముగిసిన ముడి పదార్థాలను కలిపి వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కల్తీ పొడిని రోడ్డు పక్కన ఉండే టీ స్టాళ్లతో పాటు కొన్ని ప్రముఖ విక్రయశాలలకు కూడా సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న పది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. >>2


సింగరేణిలో సహజ మరణానికి 3

రూ. 10 లక్షల ఉచిత బీమా

## నర్సంపేట డ్రైవర్ ఆత్మహత్య

>> కాలిన గాయాలతో ఆస్పత్రికి తీసుకువచ్చారని, శంకర్‌గౌడ్‌కు 60 నుంచి 80శాతం కాలిన గాయాలయ్యాయని ఎంజిఎం వైద్యులు తెలిపారు. కాగా, మెరుగైన వైద్యం కోసం శంకర్‌గౌడ్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మరణించారు. ప్రస్తుతం కంచన్‌బాగ్ డిఆర్డ్‌వో ఆసుపత్రిలో ఆయన మృత దేహాన్ని ఉంచారు.

**భద్రాచలం డిపో డ్రైవర్ లింగారెడ్డి ఆత్మహత్యాయత్నం**

ఖమ్మంలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు ప్రయత్నించారు. జి.లింగారెడ్డి అనే వ్యక్తి భద్రాచలం డిపోలో ఆర్టీసి డ్రైవర్ (స్టాఫ్ నెం: 825862) గా పనిచేస్తూ ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. రెండు రోజులుగా ఆర్టీసీ సమ్మె కావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. అయితే గతేడాది నుంచి కుటుంబానికి సంబంధించిన విషయాలపై భార్యాభర్తల మధ్య వివాదం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే గురువారం గడ్డిమందు సేవించడంతో హుటాహుటిన రేవతి సెంటర్ సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్తున్నారు. కుటుంబ విషయాలపైనే ఆత్మహత్యకు పాల్పడ్డారని డ్రైవర్ భార్య, పోలీసులు చెప్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాణాలు తీసుకోకండి

>> పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు ఆర్టీసీ కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడాలని ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాగా, కేబినెట్ సమావేశంలో మొదటి అంశంగా ఆర్టీసి కార్మికుల సమ్మెపైనే మంత్రివర్గం చర్చించింది. పలు చోట్ల కార్మికులు ఆత్మహత్యా యత్నాలు చేసినట్లు సమాచారం రావడంతో సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే కేబినెట్ సమావేశం మధ్యలో నుంచి సీనియర్ మంత్రులు బయటకు వచ్చి సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆర్‌టిసి కార్మికులు సంయమనం పాటించి సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని పేర్కొన్నారు. ఆర్‌టిసి కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని ప్రభుత్వంతో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూఆర్టీసీ కార్మికులు ఆత్మబలిధానాలు చేసుకోవద్దని కోరారు..ఉద్యమంలో మనం కొట్లాడినం.తెలంగాణ వచ్చాక గత ప్రభుత్వంలో 58 రోజులు సమ్మె చేసి.. 36 మంది మరణించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఆర్టీసీకి 10వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించింది.తెలంగాణ మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కానుకగా ఇచ్చామన్నారు. ఆత్మహత్య యత్నం చేసిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ త్వరగా కోలుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి శిత్తశుద్ధి ఉందని పేర్కొన్నారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఆర్టీసీ ఉద్యోగిని హైదరాబాద్ షిఫ్ట్ చేస్తున్నామని తెలిపారు..హైదర్‌గూడా అపోలోలో మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పారు.ఆర్టీసీ కార్మికులు ఆవేశపడొద్దు... చర్చలు జరుపుదాం.ఆర్టీసీ కార్మికులు మా కుటుంబ సభ్యులు.బావోద్వేగాలతో సమస్యలు పరిష్కారం కావు అని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌మాట్లాడుతూ ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి భాధ్యత ఉంది.కార్మికులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు అని కోరారు. కేబినెట్ స్థాయిలో చర్చ జరిగేందుకు కొంత ఆలస్యం అయింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి మంత్రుల ఆధ్వర్యంలో సబ్ కమిటీ వేశామన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో ఉద్యోగాలు తీసివేస్తారు అనే ప్రచారం కరెక్ట్ కాదు.కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. మొత్తంగా ఆర్టీసీ సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపింది. మీ సమస్యలను పరిష్కరించాలనే సానుకూల వైఖరితోనే ప్రభుత్వం అధికారుల కమిటీ వేసింది. శుక్రవారం డిప్యూటీ సిఎం ఆధ్వర్యంలోని మంత్రివర్గ సబ్ కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది.

## కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కార్?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్23:** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గురువారం సాయంత్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక కోర్టు నిలిపివేయడంతో తదుపరి ఎలా ముందుకెళ్లాలన్న విషయమై సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చర్చించినట్టుగా తెలిసింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేసే అంశంతో పాటు లీగల్‌గా ఎలా ముందుకెళ్లాలన్నా అంశంపై వారిద్దరూ చర్చించరాని సమాచారం. దీంతోపాటు సీనియర్ అడ్వకేట్లతోనూ ప్రభుత్వం లీగల్ ఒపినీయన్ తీసుకుంటున్నట్టుగా తెలిసింది.అయితే, ప్రభుత్వం ముందు రెండు ఆప్షన్స్ ఉన్నాయని సీనియర్ అడ్వకేట్లు పేర్కొన్నట్టుగా సమాచారం. మొదటిది ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లడం లేదా రెండోది కొత్త కమిషన్‌ను నియమించడం. ఈ రెండు అంశాల గురించి బుధవారం సాయంత్రం సిఎం రేవంత్‌రెడ్డితో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చర్చించినట్టుగా తెలిసింది. దీంతోపాటు కోర్టు తీర్పుపై నేడు కేబినెట్ చర్చించాలని సిఎం నిర్ణయించినట్టుగా సమాచారం. దీంతోపాటు కేబినెట్‌కు అడ్వకేట్ జనరల్‌ను పిలవాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టుగా తెలిసింది.

### నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

>> కానున్నాయి. 49 రోజుల పాటు పిల్లలకు వేసవి సెలవులు రానున్నాయి. ఈ నెల 8 నుంచి 18 వరకు సమ్మెటీవ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-2 పరీక్షలు జరిగాయి. వాటికి సంబంధించిన ఫలితాలను విద్యార్థులకు చెప్పడంతోపాటు.. విద్యార్థుల తల్లిదండ్రులతో పేరెంట్, టీచర్ మీటింగ్‌ను గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రొగ్రెస్ రిపోర్ట్‌ను ఇచ్చి భవిష్యత్‌లో వారి ఇంతకంటే బాగా చదివేలాగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించేలా చూడాలని కోరనున్నారు. ఈ సమావేశంలో వేసవి సెలవుల్లో పిల్లలను చదువుతో పాటు ఇతర సృజనాత్మక పనుల్లో ఎలా నిమగ్నం చేయాలనే దానిపై తల్లిదండ్రులతో చర్చించి వారికి సూచనలు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యుఆర్ఎస్‌లతోపాటు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు కూడా వేసవి సెలవులు కొనసాగనున్నాయి.

### ఇక కొత్త బీమా, బ్యాంకింగ్ పథకాలు

>> ప్రధాన ప్రయోజనాలను గూర్చి వివరిస్తూ భారీ బీమా కవరేజ్ కింద వ్యక్తిగత ప్రమాద బీమాలో బాగంగా రూ. 1.5 కోట్లు వరకు కవరేజ్ ఉంటుందన్నారు. విమాన ప్రమాదాల్లో మరణిస్తే రూ.2 కోట్లు వరకు బీమా. శాశ్వత లేదా పాక్షిక వైకల్యానికి రూ.1.5 కోట్లు వరకు భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.20 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ (టాప్‌అప్ సదుపాయంతో) అందు బాటులోకి తెస్తున్నామన్నారు. బ్యాంకింగ్ సదుపాయాలకు సంబంధించి కేంద్ర ఉద్యోగులకు జీరోబ్యాలెన్స్ శాలరీ అకౌంట్‌తో పాటు, ఉచితంగా ఆర్టీజీఎస్, ఎన్ఇఎఫ్‌టిఎస్, యుపిఐ లావాదేవీలు. డెబిట్, క్రెడిట్ కార్డులపై అదనపు ప్రయోజనాలు ఉంటాయని వెల్లడించారు. ఇదే సమయంలో వివిధ రకాల రుణాలపై రాయితీలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా చాలా తక్కువ వడ్డీ రేట్లకే హోమ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికల్ మరియు పర్సనల్ లోన్లు. లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, లాకర్ అద్దెల్లో ప్రత్యేక రాయితీలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఆరోగ్య భద్రతలో భాగంగా ఉద్యోగి కుటుంబం మొత్తానికి సమగ్ర ఆరోగ్యబీమా వర్తించనుంది.

### వారం - వర్జ్యం

24-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
అష్టమి రా.7.26
పుష్యమి రా.8.18
వర్జ్యం : లేదు
దు.ఉ.8.18-ఉ.9.09,
2) మ.12.31-మ.1.22
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలను ప్రవేశ పెడతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం.

**వృషభం:** కృషి వ్యర్థం కాదన్న సంగతి కొన్ని సంఘటనలు ఋజువుచేస్తాయి. వృత్తిలో వున్నవారికి మంచి అవకాశాలు లభిస్తాయి.

**మిథునం:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశాంతి పొందుతారు. ఆరోగ్యపరంగా జాగ్రత్తలు పాటించాలి.

**కర్కాటకం:** ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోదముద్రలు పడతాయి.నూతన విద్యావకాశాలు కలవు.

**సింహం:** కార్యాచరణ కోసం యోచన చేస్తారు. కష్టించి పనిచేస్తారు. అందుకు తగిన ఫలితాలను అందుకుంటారు.

**కన్య :** ఇతర భాషల పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. పురోభివృద్ధి పరంగా నామమాత్రపు ఫలితాలను సాధిస్తారు.

**తుల :** వృత్తి, ఉద్యోగాలలో కొన్ని అనుకోని మార్పులు వస్తాయి. మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు.

**వృశ్చికం:** కోర్టు సంబంధిత, భూవివాదాలు సంబంధించిన వివాదాలకు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**ధనుస్సు:** కళా, సాంస్కృతిక రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. వృద్ధాశ్రమాలను సందర్శిస్తారు.వస్త్రలాభం.

**మకరం:** అనేకాంశాలు అనుకూలంగా వుంటాయి. ప్రతిభాపాటవాలతో మంచి ఫలితాలు సాధిస్తారు.బంధువుల కలయిక.

**కుంభం:** నేర్పుగా కుటుంబ వ్యవహారాలను సరిదిద్దుకుంటారు. వ్యాపారాలలో లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి.

**మీనం:** ఆర్థికంగా అనుకూల ఫలితాలు ఉండటం వలన పొదుపు పథకాలను అవలంభిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం తమిళనాడు ఎన్నికల్లో ఓటు వేసిన సిఎం స్టాలిన్, రజనీకాంత్, కమల్ హాసన్, అజిత్, ధనుష్

# పోలింగ్‌లో ఓటు వేసిన ప్రముఖులు, సినీనటులు!

**చెన్నై, ఏప్రిల్ 23:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు), వీవీప్యాట్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా మొదలైంది. సమస్యలను గుర్తించిన ఎన్నికల అధికారులు వెంటనే రంగంలోకి దిగి, మరమ్మతులు చేపట్టి పోలింగ్‌ను తిరిగి ప్రారంభించారు. ప్రారంభంలో కొన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ, ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ప్రజాస్వామ్య పండుగలోపాల్గొనేందుకు ప్రజలు ఉత్సాహం కనబరిచారు. సేలంలోని సిలువంపాలయం పంచాయతీ పాఠశాలలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన కుటుంబంతో కలిసి ఓటు వేశారు. మరోవైపు, తిరుచ్చిలోని తిల్లియినగర్‌లో వీవీప్యాట్ మొరాయించడంతో మంత్రి కేఎన్ నెహ్రూ కాసేపు పోలింగ్ బూత్ వద్ద వేచి చూడాల్సి వచ్చింది. నామ్ తమిలర్ కట్చి చీఫ్ కోఆర్డినేటర్ సీమాన్, బీజేపీ రాష్ట్రఉపాధ్యక్షురాలు ఖుష్బూసుందర్ కూడా తమఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రముఖ సినీ నటుడు అజిత్ కుమార్ రాష్ట్రంలో తొలి ఓటర్లలో ఒకరిగా నిలిచారు. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఆయనను ముందుగా బూత్‌లోకి అనుమతించారు. ఓటు వేసిన అనంతరం సిరా గుర్తును చూపిస్తూ బయటకు రాగా, ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు కేరింతలు కొట్టారు. దీంతో అక్కడ కాసేపు సందడి వాతావరణం నెలకొంది. సినీ నటులు రజనికాంత్,కమల్‌హాసన్,అజిత్, శివకార్తికేయన్ దంపతులు,నటుడు విశాల్, అలాగే త్రిష కుటుంబ సభ్యులతోకలిసి వచ్చి ఓట్లువేసారు. అలాగే సినీ నటుడు ప్రభు కూడా కుటుంబంతో కలిసి వచ్చి ఓటు వేయడం ఓటర్లకు ఆసక్తిని పెంచింది.

## 100 రోజుల్లో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు

>> మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. మే 4న జరిగే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదు. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.రాష్ట్ర మంత్రివర్గం ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలకవర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 64 ఎకరాల్లో 21 రకాల స్పోర్ట్స్‌కు సంబంధించిన సౌకర్యాలు కల్పించడంతో పాటు అవుట్ డోర్ స్టేడియం సామర్థం 20 వేల నుంచి 50 వేలకు పెంచాలని నిర్ణయించింది. స్విమ్మింగ్ పూల్ సామర్థం పెంపుతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాకారులకు వసతి, శిక్షణ సౌకర్యాలు కల్పించడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్ కు ఇచ్చి కమర్షియల్ యాక్టివిటీస్‌కు అనుమతి, కమర్షియల్ యాక్టివిటీస్‌తో వచ్చే రెవెన్యూను స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని కేబినెట్ నిర్ణయించింది. మంథని నియోజకవర్గ ప్రాంత ప్రజల చిరకాల కోరిక చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలని కేబినేట్ నిర్ణయం తీసుకుంది. మహాదేవ్‌పూర్, కాటారం, మల్హర్ రావు, మహాముత్తారం మండలాల్లో దాదాపు 45 వేల ఎకరాలకు, 63 గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం చేకూరుతుంది. భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది. ఈ ప్రాజెక్టుకు దాదాపు 2,427 ఎకరాల భూమి అవసరం. ఇప్పటివరకు 1,020 ఎకరాలు సేకరించారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు.



బెంగల్‌లోని మిద్నపూర్‌లో గురువారం ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

## గొంతులోకి క'ల్తీ'

>> వీరిలో కొంపల్లికి చెందిన పరేశ్ రాజన్ (రంగుల సరఫరాదారు), పెట్లాబుర్జుకు చెందిన సంజు అలియాస్ పతి (రంగులు కలిపే వ్యక్తి), ముషీరాబాద్‌కు చెందిన సతీష్, బోయిన్‌పల్లికి చెందిన నవీన్, ఆసిఫ్‌నగర్‌కు చెందిన నరసింహ (250 గ్రాముల ఇల్లీగల్ ప్యాకెట్ల తయారీదారు), రాజేంద్రనగర్‌కు చెందిన చున్నిలాల్ చౌదరి, బోరబండకు చెందిన నరసింహులు, పెట్లాబుర్జుకు చెందిన రాజేష్, బీదర్‌కు చెందిన రవీందర్ మరియు మల్లేపల్లికి చెందిన వసీం ఉన్నారు. వీరంతా రంగులు కలపడం, ప్యాకేజింగ్ మరియు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిర్ధారించారు. విచారణ వివరాల ప్రకారం, నిందితులు కోల్‌కతా, కేరళ మరియు అస్సాం వంటి రాష్ట్రాల నుండి తక్కువ నాణ్యత గల టీ పొడిని సేకరించి, దానికి ఆకర్షణీయమైన రంగు రావడానికి సన్‌సెట్ ఎల్లో ,టార్ట్రాజైన్ వంటి హానికరమైన రంగులతో పాటు బెల్లం పాకం, వాడేసిన టీ పొడి మరియు ఎక్స్‌పైరీ అయిన టీ పొడిని కలుపుతున్నారు. ఈ హానికరమైన మిశ్రమాలను ప్రసిద్ధ బ్రాండ్ల పేరుతో రీప్యాకేజింగ్ చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. ఇటువంటి కల్తీ టీ పొడి సేవించడం వల్ల కడుపు సంబంధిత వ్యాధులు, అలర్జీలు మరియు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ దాడుల్లో సుమారు 3,000 కిలోల కల్తీ టీ పొడి, 1500 కిలోల ఎక్స్‌పైరీ టీ పొడి, 100 కిలోల బెల్లం,భారీగా కృత్రిమ రంగులను సీజ్ చేశారు. టీ పొడిని కేవలం గుర్తింపు పొందిన విక్రేతల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని డిసిపి గైక్వాడ్ వైభవ్ సూచించారు. ఆహార కల్తీకి సంబంధించి ఎటువంటి అనుమానం ఉన్నా వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. తయారీదారులు ఆహార భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారతీయ న్యాయ సంహిత, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ ప్రకారం కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులను టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్లు ఎన్. రంజిత్ కుమార్‌గౌడ్, ఎం.అంజయ్య బృందం విజయవంతంగా నిర్వహించింది.

## కాళేశ్వరంపై త్వరలో సిబిఐ డైరెక్టర్‌ను కలుస్తాం

>> సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టింది. ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవని, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చిందని వివరించారు. గురువారం సాయంత్రం కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. తొమ్మిది నెలలైనా సీబీఐ దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదు అని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలియజేశారని చెప్పారు.. అందుకే సీబీఐ దర్యాప్తును వేగవంతం చేయాలని ప్రభుత్వం తరపున మరోసారి సీబీఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు మొత్తం పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా.. లేదా.. అనేది, వారిచ్చే సలహాలు సూచనల ఆధారంగా నడుచుకోవాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కాగా, త్వరలోనే ఢిల్లీకి వెళ్లి సిబిఐ డైరెక్టర్‌ను తాను, సిఎం రేవంత్‌రెడ్డి కలుస్తామన్నారు. త్వరగా విచారణ జరపాలని కోరుతామన్నారు. పీసీ ఘోష్ నివేదికతో పాటు కాళేశ్వరంపై కాగ్ రిపోర్ట్, ఎన్‌డిఎస్ రిపోర్ట్, ఇతర నివేదికలను కూడా అందజేస్తామన్నారు. కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్ట విరుద్ధమని కెసిఆర్,హరీశ్‌రావు పిటీషన్ వేశారని,అయితే కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. కెసిఆర్,హరీశ్‌రావుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తీసిపుచ్చిందని, నివేదిక కొనసాగుతుందని హైకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. సాంకేతిక అంశాల కారణంగానే కెసిఆర్,హరీశ్‌రావులపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించిందని, వారిద్దరూ నిర్దోషులని,కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కాదని ఉన్నత న్యాయస్థానం ఎక్కడా చెప్పలేదన్నారు. బిఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు,. అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## మే 4 నుండి హజ్ యాత్ర

>> టీకాల శిబిరాలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. హజ్ హౌస్ నుండి విమానాశ్రయానికి ప్రత్యేక బస్సులు, సులభమైన సామాను నిర్వహణ, మహిళా యాత్రికులకు ప్రత్యేక సౌకర్యాలు, ఏరోబ్రిడ్జ్ బోర్డింగ్‌తో సీనియర్ సిటిజన్లకు మద్దతు, ప్రార్థన, పారిశుధ్య ఏర్పాట్లు, జన సమూహ నియంత్రణతో కూడిన నిరంతర భద్రతను కల్పించాలని సూచించారు.రియల్ టైమ్ అప్‌డేట్ల కోసం హజ్ సువిధా యాప్‌తో పాటు, అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌ను ఉపయోగించాలని పేర్కొన్నారు. అలాగే, యాత్రికులకు ఇబ్బందులు లేకుండా సజావుగా యాత్ర నిర్వహించడానికి జిల్లా స్థాయి మత నాయకులతో అంతర్‌విభాగ సమన్వయం అవసరమని ఆయన ఉద్ఘాటించారు. హైదరాబాద్ నుంచి విమానంలో ప్రయాణిస్తున్న 9,660 మంది యాత్రికులలో 6,660 మంది తెలంగాణకు చెందినవారు కాగా, మిగిలినవారు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారని వివరించారు. కాగా హజ్ యాత్ర నిమిత్తం తెలంగాణకు 11,557 ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందగా, 2,500 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసులు, విమానాశ్రయ అధికారులు, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, ఆరోగ్య శాఖ, ట్రాన్స్కో, అగ్నిమాపక సేవలు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకులు, హజ్ కమిటీకి చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు.

## ఓటెత్తిన బెంగాల్

>> పోలింగ్‌నమోదుకావడం ఇదే ప్రథమం. అదే పశ్చిమబెంగాల్‌లో జరిగిన తొలివిడత పోలింగ్‌లో రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేనంతగా పోలింగ్‌నమోదయింది. 91.83శాతంమంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులుప్రకటించారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో జరిగిన ఎన్నికలకుగాను 5.73 కోట్ల అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 75,064 పోలింగ్‌కేంద్రాలు కూడా ఓటర్లతో క్రిక్కిరిసాయి.తమిళనాడు ఎన్నికల బరిలో మొత్తం 4023 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కరూర్‌జిల్లాలో 91.86శాతంపోలింగ్ జరిగితే, చెన్నైలో 83.09శాతం, మదురైలో 80.15శాతం, కోయంబత్తూరులో 84.40శాతం, తిరుచిరాపల్లి జిల్లాలో 85.04శాతం పోలింగ్ నమోదయింది. కొలత్తూరు నియోజకవర్గంలో అంటేసీఎం స్టాలిన్‌పోటీచేస్తున్న నియోజకవర్గంలో 85.63శాతం నమోదయింది. చేపాక్ తిరవల్లికేనీ డిప్యూటిసిఎం ఉదయనిధిమారన్ పోటీచేస్తున్న నియోజకవర్గంలో 83.58శాతం నమోదయింది. ఎడప్పాడి నియోజకవర్గంలో 91.61శాతం నమోదుకాగా తిరుచిరాపల్లి ఈస్ట్‌లో టివికె విజయ్‌పోటీచేసే చోట 81.55శాతం నమోదయింది. అలాగే పెరంబూరులో కూడా 89.20శాతం ఉన్నట్లు అంచనావేసారు.

ఇక పశ్చిమబెంగాల్ పరంగాచూస్తే తొలివిడత 152 నియోజకవర్గాల్లోజరిగిన పోలింగ్‌లో ఉద్రిక్తతలు, ఘర్షణలు, రాళ్లువిసురుకోవడం వంటి సంఘటనలు పెరిగాయి. మొత్తం 294 నియోజకవర్గాల్లో 152 నియోజకవర్గాలకు తొలివిడత పోలింగ్ జరిగింది. మొత్తం 3.60 కోట్లమంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తేలింది. పోలింగ్‌ముగిసిన తర్వాత 8గంటల సమయానికి 91.83 శాతం నమోదయినట్లు తేలింది. ఎన్నికలసంఘం వివాదాస్పద సర్‌తో లక్షలాదిమందిని తొలగించారన్న అభియోగాలమధ్య నడిచిన తొలివిడత పోలింగ్‌లో భారీ ఎత్తున ఓటింగ్‌శాతం పెరగడం అందరినీవిస్మయపరిచింది. మొత్తం 16 జిల్లాల్లో ఉదయం ఏడుగంటలనుంచే భారీ భద్రతమధ్య పోలింగ్‌జ రిగింది. మొత్తం 1478 మంది అభ్యర్థులు బరిలోనిలిచారు. వీరిలో167 మంది మహిళలున్నారు. భారీ ఎత్తున అధినేతలందరూ బెంగాల్‌లోనే మకాంవేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం సర్ ప్రభావం కూడా ఉందని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 91 లక్షలమందిపేర్లను తొలగించారన్న అభియోగాలు ఎన్నికల సంఘంపై ఉన్నాయి. మొదటి రెండు గంటల్లోనే 18.76శాతం నమోదయితే 11 గంటలకు 41.11శాతం,మధ్యాహ్నం ఒంటిగంటకు 62.18శాతం, పెరుగుతూ పోయింది. ఓటర్ల స్పందన అనూహ్యంగాపెరిగింది. ఉత్తరబెంగాల్‌నుంచి సమస్యాత్మకమైన ముర్షిదాబాద్, రాజకీయంగా అనిశ్చితంగా ఉన్న జందల్‌మహల్‌వరకూ కూడా ఓటర్లు అధికసంఖ్యలో వచ్చారు. సర్ కసరత్తులతో ఓటర్లలో 12శాతం మంది తగిపోయారని టిఎంసి ఆరోపించింది. తొలివిడత పోలింగ్‌లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, రాళ్లురువ్వడం, అభ్యర్థులను పరుగులుపెట్టించడంవంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అయినా కూడా దక్షిణ్ దినాజ్‌పూర్‌లో 94.85శాతం, కోచ్‌బెహార్‌లో 94.54శాతం, బీర్‌భుమ్‌లో 93.7శాతంచొప్పున పోలింగ్ నమోదయింది. మొత్తం 16 జిల్లాల్లోకూడా సగటు శాతం 82శాతాన్ని పోలింగ్ దాటేసింది. బిజెపి అభ్యర్థి అగ్నిమిత్రపాల్ కారుపై రాళ్లురువ్వారు. కారు అద్దాలు పగిలిపోయాయి. అసన్‌సోల్ దక్షిణ్ నియోజకవర్గంలో రహమత్‌నగర్‌వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది.

వార్త

స్వానుభవంతో తెలుసుకొనేంత వరకు చాలా సత్యాల అర్థం మనకు తెలిసిరాదు.

- జాన్ స్టువర్ట్ మిల్


# అడుగంటుతున్న భూగర్భజలాలు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడ ఉంటే జీవం అక్కడ ఉంటుంది. బ్రరెపోతే కానీ పాడి సంగతి తెలియదంటారు. అలానే బావి ఎండిపోతే కానీ నీటివిలువ తెలియదంటారు. వేసవిలో మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు ప్రజలు ఎదుర్కోవడం సర్వసాధారణమైపోయింది. పాలకుల అసమర్థత, కొందరి అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యంతోపాటు ప్రకృతి సహాయ నిరాకరణ కూడా తోడు కావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీరు తాగి కోట్లాది మంది దేశవ్యాప్తంగా రోగాలబారిన పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా ఎంతో సాధించుకున్నామని గర్వంగా చెప్పుకుంటున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని నీటి సమస్య పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని చెప్పడం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్లు ఖర్చుపెట్టారు, పెడుతున్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్రస్థాయివరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంటున్నది. దేశవ్యాప్తంగా నూటయాభైకిపైగా ప్రధాన జలాశయాల్లో నీరు అడుగంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లు చెప్తున్నారు. గత దశాబ్దకాలంలో సగటు నిల్వలతో పోలిస్తే నలభైశాతం లోటు ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. మొన్న ఖరీఫ్‌లో వర్షాలు బాగా కురిసినా, జనవరి నుండి అకాల వర్షాలు కురుస్తున్నా అవి పంటలనో, రైతులనో, సామాన్యులనో ఇబ్బందిపెట్టేందుకే కానీ ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేకపోతున్నాయి. దేశవ్యాప్తంగా నీటి వినియోగం యేడాది యేడాదికి పెరిగిపోతున్నది. బోరుబావుల తవ్వకం ఊహకుమించి విస్తరిస్తున్నది. అందుకు తగినట్టుగా విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. అదే స్థాయిలో నీటి వృధా కూడా ఏమాత్రం తక్కువ లేదు. ముఖ్యంగా వ్యవసాయరంగంలో ఉచిత విద్యుత్ నీటి వృధాను పెంచుతుందని చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలో అనేక రాష్ట్రాల్లో భూగర్భజలమట్టాలు పడిపోతున్నాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో యేటా రెండు వందల యాభై ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలను వినియోగిస్తున్నారు. బోరుబావుల తవ్వకంపై నిబంధనలున్నా పట్టించుకోవడం లేదు. నిరాటంకంగా తవ్వేస్తున్నారు. వాస్తవంగా భారత్‌లో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, అందులో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి వాడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భజలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల వల్లసన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులు కొంతమేరకు లాభపడిన మాట వాస్తవమే. అయినా నానాటికీ బోరుబావుల మీదనే ఆధారపడే పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తుంది. భూగర్భజలాల వినియోగం పెరగడం, నీటి నియమాలు నీరు గారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం భూగర్భజలాలు వాడుకుంటున్నట్లు అనధికార లెక్కలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. సాగునీరు అందక బోరుబావులు నోరెళ్లబెట్టడంతో తెలంగాణలోని మెట్ట ప్రాంతాల్లో రబీ పంటలు ఎండిపోతున్నాయి. రాత్రింబవళ్లు శ్రమ చేసి పెట్టుబడి అంతా పెట్టి నోటికి అందుతుందన్న దశలో కళ్ల ముందు నీరులేక పంటలు ఎండిపోవడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరొకపక్క దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని కేంద్రమే గతంలో అంగీకరించింది. పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా దేశంలో రెండు వందల యాభై జిల్లాల్లో ఇనుము, రెండువందల ఎనిమిది జిల్లాల్లో ఫ్లోరైడ్, నూట అరవైతొమ్మిది జిల్లాల్లో క్షారత, ముప్పైతొమ్మిది జిల్లాల్లో భూగర్భజలాల్లో పాషాణంస్థాయి అధికంగా ఉన్నట్లు కేంద్రమే గతంలో వెల్లడించింది. పాతాళంలోకి దిగజారిపోతున్న జలాలను పైకి తోడటానికి ఇటు విద్యుత్ కానీ, అటు డీజిల్ వాడకం కానీ పెరిగిపోతున్నది. మంచినీటి కొరతను ఆసరాగా చేసుకొని కొందరు దళారులు తమ మంచినీటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారానికి అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలు, పట్టణాలకే కాక మండల కేంద్రాలకు, గ్రామాలకు, చివరకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. అయితే స్వచ్ఛమైన మంచినీటి పేరుతో సరఫరా అవుతున్న ఆ నీరు ఏమేరకు నాణ్యత ఉందో నిర్ధారించే పరీక్షాకేంద్రాలు కానీ, అధికార గణం కానీ, తనిఖీలు కానీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఏదిఏమైనా భూగర్భజలాల మట్టాలు తగ్గడం మానవాళికి ఏమాత్రం క్షేమం కాదు. ఇంకొక పక్క లక్షలాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిలు సాగునీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా వృధాగా సముద్రం పాలవుతున్నది. ప్రజల్లో అవగాహన లోపం కూడా సమస్య తీవ్రతను పెంచుతున్నది. మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



క్రమశిక్షణ నుంచే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.

తిరుక్కురళ్



ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.

మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### అంతా మన మంచికే..

కేంద్ర ప్రభుత్వపుమహిళారిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల వాయిదా 'అంతా మన మంచికే' అనే కథలా మనమంతా భావించాలి. ఈబిల్లులు చెప్పేవాళ్ళకి వినేవాళ్లకి బాగానే వున్నా వాస్తవానికి ప్రజలకు మేలు చేయకపోగా వారిపై పన్నుల భారం రెట్టింపుచేస్తుంది. ఇవిరాజకీయ నిరుద్యోగులను సంతృప్తి పరచటానికే. ఇక మహిళా సభ్యుల పెంపుదల విషయానికొస్తే, ఇప్పుడున్న మహిళా సభ్యుల్లో అత్యధిక శాతంమందికి కుర్చీలు వారికైనా పెత్తనం భర్తలదనే మాటలు వింటున్నాము. ఇక పార్లమెంటు, శాసన సభ్యుల సంఖ్య కూడా పెంచాల్సిన పనిలేదు. కేంద్రంలో ప్రధాని, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి నిర్ణయాలు చట్టాలవుతున్నాయి. సభల్లో తగిన చర్చలు వుండవు. ఏడాదిలో 40 రోజులు హాజరైతే చాలు. వారి భద్రత కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చవుతుంది. కనుక ఈక్లిష్ట పరిస్థితుల్లో పెరుగుతున్న ఈ వీఐపీ సంస్కృతి, ప్రభుత్వ ఖర్చులు తగ్గించే చర్యలపై పార్లమెంటులో చర్చించాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఆస్తుల సృష్టిపై దృష్టి పెట్టాలి

ఆంధ్రప్రదేశ్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుతీరు ఇటీవల చర్చనీయాంశమైంది. గత రెండేళ్లలో లేబర్‌బడ్జెట్ తగ్గడం, పని దినాల సంఖ్య క్షీణించడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. గతంలో ఈపథకం అమలులో అగ్రగామిగా ఉన్నరాష్ట్రం, ప్రస్తుతంలక్ష్యసాధనలో వెనుకబడటం వల్ల నిరుపేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయ పనులు లేని కాలంలో వలసలను నిరోధించే ఈ రక్షణ కవచం బలహీనపడటం ఆందోళనకరం. మౌలికసదుపాయాలకల్పన కుంటుపడకుండా సామాజిక ఆస్తుల సృష్టిపై దృష్టి పెట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యువత డ్రగ్స్ బారిన పడొద్దు

నేటి యువకులు ఏ విషయమైనా చాలా తొందరగా నేర్చుకునే మేధో శక్తిగలవారు. కానీ అవకాశాలను పాతరేస్తూ డ్రగ్స్, శీతలపానియాలు పలు రకాల పనులకు అలవాటు పడి జీవితాన్ని వృథా చేస్తున్నారు. కుటుంబ జీవితాలను రోడ్డున పడేస్తున్నారు. ఇలాంటి విషయాలపై వీలైనంత వరకు అవగాహన కల్పించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఉద్యోగినులపై వేధింపులు

ప్రముఖ కార్పొరేట్ సంస్థలో పనిచేసే కొందరి ఉద్యోగినులను సంస్థలోని కొంతమంది టీమ్‌లీడర్లు లోబరచుకోవటం, లైంగికంగా, మతపరంగా వేధింపులకు గురిచేయటం అత్యంత బాధాకర విషయం. కెరీర్‌పై ఎన్నో ఆశలతో ఉద్యోగంలో చేరే యువతులను టీమ్ లీడర్లు వృత్తిపరంగా అణచివేస్తామని బెదరించి మతమార్పిడులకు పాల్పడటం కార్పొరేట్ రంగంలో పరిపాలనా లోపాలను బయటపెడుతోంది. 1997లో సుప్రీంకోర్టు విశాఖస్టేట్ ఆఫ్ రాజస్థాన్‌కేసులో వెలువరించిన మార్గదర్శకాలను అన్నిరంగాలలో పనిచేసే మహిళలకు వర్తిస్తాయి. వివిధ సంస్థలలో పనిచేసే మహిళలకు ఈ మార్గదర్శకాల వల్ల రక్షణ లభిస్తుంది. పది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలలో తప్పనిసరిగా ఒకఅంతర్గత కమిటీ ఉండాలి. అందినఫిర్యాదులనునిర్ణీతరోజులలో పరిష్కరించాలి. సుప్రీంకోర్టు ఎంతో ముందుచూపుతో ఈ తీర్పును వెలువరించింది. సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా వచ్చిన "పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధిపులు నివారణ, నిషేధం చట్టం, 2013" పై అందరికీ అవగాహన కలిగేలా ప్రచారం చేయాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టాలి

ఇటీవల భారతీయ రైల్వే అన్ని జోన్లాల్లో ప్రయాణీకుల రద్దీని తట్టుకునేందుకు వివిధ రకాల ప్రత్యేక రైళ్లను ప్రవేశ పెట్టడం, వాటి అవసరం తగ్గినతర్వాత రద్దు చేయడం సహజమే. గానీ ఈమధ్య కొన్నిమార్గాలలో అవి దాదాపు పదిగంటలకు పైబడి ఆలస్యంచూసి రిజర్వేషన్‌చేసుకొన్న కుటుంబాలు వేరే ప్రత్యామ్నాయం లేక సాధారణ బోగీల్లో నిల్చుని ప్రయాణం తప్పడం లేదు. వాటిని రద్దుచేస్తేప్రయాణీకులకు డబ్బు ఏ మాత్రం రాదు. రైలు ఆలస్యానికి ఎన్నో కారణాలు ఉంటాయి కావున సదరుఈవిషయం ప్రయాణీకులకుతెలియచేయడం న్యాయం.

- బొల్లోజు మేఘనాదాం, విశాఖపట్నం

### ఆహార కల్తీపై అవగాహన

నేటి కాలంలో ఆహార కల్తీ ఒక పెద్ద సమస్యగా మారింది. కల్తీ ఆహారం వల్ల జీర్ణ సమస్యలు, అలర్జీలు, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చేఅవకాశముంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. మనం కొనుగోలు చేసే ఆహార పదార్థాల గడువుతేదీ, నాణ్యతగుర్తులు తప్పనిసరిగా పరిశీలించాలి. వీలైనంత వరకు స్వచ్ఛమైన, ఇంటి వద్ద తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలి. బయట ఆహారం ఎక్కువగా తినకుండా ఉండటం మంచిది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యుద్ధాల వల్ల సాధించేదేమిటి?

ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో 5.5శాతం సైనిక కార్యకలాపాలే కారణమని యు.ఎన్.ఒ అంచనా వేసింది. ఇజ్రాయిల్ హమాస్ పోరువల్ల గాజాలో 95శాతం నీటివనరులు కలుషితమయ్యాయి. ఇలాంటి గణాంకాలు ఎన్నో ఉదాహరణగా ఇవ్వొచ్చు. ఐతే యుద్ధాలవల్ల లాభం పొందేవాళ్ళున్నారా? అనే ప్రశ్నకు జవాబుగా, ఆయుధ తయారీ కంపెనీలు లాభపడడం, చిన్న చిన్న దేశాల చమురు తయారీ కేంద్రాలపై సామ్రాజ్యవాదులు ఆధిపత్యం చెలాయించడం, చమురు ఉత్పత్తి బేరల్ రేట్లు గణనీయంగా పెంచి అమ్ముకోవడం, యుద్ధవిజేతలు సరిహద్దు భూభాగాలలోకి చొచ్చుకుపోవడం, సహజవనరులను ఆక్రమించుకోవడం, ఇవన్నీ ఒకటికొకటి వచ్చిచేరతాయి.



పిల్లా తిరుపతిరావు

మధ్యప్రాచ్యమంతా యుద్ధ దావాగ్నిలో పడి బూడిదైపోతున్నది. ఒకవైపు ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడి చేసింది. మరోవైపు లెబనాన్‌పై ఇంకా దాడులు చేస్తూనే ఉన్నది. అమెరికా ఇరాన్‌పై రణభేరి మోగించింది. ఈ ఇరుదేశాల మధ్య భీకరపోరు జరుగుతున్నది. దీని ఫలితంగా గల్ఫ్‌దేశాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయి. గతంలో రష్యా, ఉక్రెయిన్‌పై దాడి చేసింది. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు ఇంకా చల్లారనేలేదు. ఇలా పలు దేశాలు శత్రుదేశాల దాడులకు ఆహుతి అవుతున్నాయి. దీంతో మూడో ప్రపంచయుద్ధం వస్తుందన్న భయంతో యావత్తు ప్రపంచం బెంబేలెత్తిపోతున్నది. అగ్రరాజ్యాలు, పెద్దదేశాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, భూ ఆక్రమణలు చేయడానికి, విలువైన సహజ వనరులను కొల్లగొట్టడానికి చిన్నచిన్న దేశాలపై, ప్రక్క దేశాలపై ఏకపక్ష దాడులకు దిగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి లాంటి శాంతిని నెలకొల్పే సంస్థలు ఏమీచేయలేక చేతులెత్తేస్తున్నాయి. పలుదేశాలు శాంతికోసం చేసే కార్యాచరణ అంతంత మాత్రంగానే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధాలనే నివారించకపోతే ప్రపంచం గడ్డుపరిస్థితిని ఎదుర్కొనక తప్పదు. అసలు ఈ యుద్ధాలు వల్ల సాధించేదేమిటి? అన్న ప్రశ్నకు బోలెడన్ని జవాబులు తెరమీదకు వస్తాయి. యుద్ధం అశేష జనవాహినిలో అశాంతిని రేపుతోంది. అలజడిని సృష్టిస్తోంది. యుద్ధం ప్రాణ, ఆస్తి నష్టాల వరకే పరిమితం కాదు. అనేక అంకురాలను నాశనం చేస్తోంది. అవి సజీవమైనవి, నిర్జీవమైనవి ఏవైనా కావొచ్చు. వీటి వినాశనం వల్ల భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ఆయా తరాల అభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతోంది. యుద్ధాల వలన బాగుపడిన రాజుగానీ, రాజ్యంగానీ ఈ లోకంలో ఎక్కడా లేదు. యుద్ధాల వల్ల వ్యక్తుల మధ్యగానీ, దేశాల మధ్యగానీ ఐక్యత పొడచూపిన సందర్భాలైతే ఉండవు. ఒకరికొకరు ప్రక్కలో బల్లెంలానే వ్యవహరిస్తారు. యుద్ధాలు ప్రకృతి వైపరీత్యాల వలె జనజీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అందుకే యుద్ధాన్ని మనిషి తనకు తానుగా తెచ్చిపెట్టుకునే ప్రకృతి వైపరీత్యంగా పేర్కొనవచ్చు. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాలు వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తాయి. కానీ యుద్ధాలు మానవ మస్తిష్కాలలో మాలిన్యాలు చేరడంవల్ల సంభవిస్తున్నాయి. ఆ మాలిన్యాలకు అహంభావం, ఆధిపత్య భావజాలం, జాత్యహంకారం, సామ్రాజ్యవాదం అని పేర్లు పెట్టుకోవచ్చు. అనాది నుంచి చూస్తే యుద్ధాలు భూమి, సంపద, స్త్రీల కోసం జరిగాయి. ఇవన్నీ వివిధ జాతుల మధ్య, తెగల మధ్య భీకరంగా జరిగాయి. పురాణాల ప్రకారం చూస్తే దేవాసుర యుద్ధం, రామరావణ యుద్ధం, కురుక్షేత్ర యుద్ధం మొదలగు యుద్ధాలు వినాశనం తప్ప, చివరకు సాధించినదేదీ లేదు. చారిత్రకంగా చూస్తే కళింగ యుద్ధం, రాక్షసి తంగడియుద్ధం లాంటివి అప్పటి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఆనాటి అందమైన కట్టడాలను, నిర్మాణాలను ధ్వంసం చేశాయి. తద్వారా అలనాటి అపురూప సంస్కృతిని చెరిపేసాయి. ఉదా: ఈ చెరిపిన ఆనవాళ్లు హంపి విజయనగర ప్రాంతంలో ఇప్పటికీ దర్శనమిస్తూనే ఉంటాయి. నేడు ప్రపంచంలో అణుయుద్ధాలు జరుగుతున్నాయి. నాగరిక సమాజమే యుద్ధాలకు పురిగొల్పుతోంది. పోరు సలపడం అన్నివిధాలా నష్టం అని తెలిసిన ఆధునిక విద్యావంతులే ఆగ్రహావేశాలకు లోనై రణభేరి మ్రోగించడం జరుగుతున్నది. మానవ పరిణామక్రమంలో తొలుత వేట, ఆహారాన్వేషణలో భాగంగా అనేక యుద్ధాలు జరిగాయి. స్థిరనివాసం ఏర్పరచుకున్న



తర్వాత మానవుడు వ్యవసాయం చేయడంప్రారంభించాడు. ఈ వ్యవసాయమే భూమిపై ఆలోచనను, ఆసక్తిని రేపింది. భూమిపై మనిషి సర్వహక్కులను పొందాలనుకున్నాడు. క్రమేపి ఆధిపత్య ధోరణిని తలకెత్తుకుని విచక్షణారహితంగా దిగువ వర్గాల ప్రజా సమూహాలపై విరుచుకుపడ్డాడు. తోటి మానవులను బానిసలను చేసుకున్నాడు. వారి ఆస్తులను బలవంతంగా లాక్కున్నాడు. వారి వ్యక్తిగత జీవితాలపై కూడా తన దౌర్జన్యాన్ని ప్రదర్శించాడు. భూమిని ఆక్రమించుకొని రాజ్యాలను ఏర్పరచుకున్నాడు. అంతటితో ఆగలేదు రాజ్యకాంక్షతో యుద్ధనీతిని సృష్టించుకున్నాడు. బలవంతుడు బలహీనులపై యుద్ధం చేసే ధర్మాన్ని కూడగట్టుకున్నాడు. అంతే రెచ్చిపోయాడు. దైవం ఏదైనా చేయొచ్చు, ఎవరినైనా శిక్షించొచ్చు అనే న్యాయసూత్రాలను నిర్మించుకున్నాడు. ఈ శిక్షలు బలవంతులకు ఒకలాగా, బలహీనులకు ఒకలాగా పొడచూపాయి. ఈ ద్వంద్వ విధానాలే కొన్నేండ్లకు పీడిత వర్గాల ఐక్యతకు దారితీసాయి. వారంతా విప్లవం పేరిట తిరుగుబాట్లు చేశారు. సమసమాజ స్థాపనకు నడుంబిగించారు. కాలక్రమంలో ఈ పరిస్థితులే ఆధిపత్య వర్గాలకు కన్నుకుట్టాయి. దాంతో జాత్యహంకారంతో సామ్రాజ్యవాదంపేరిట మరలా పేద, మైనారిటీ వర్గాలపై దాడులకు పూనుకుంటున్నారు. ఇవే నేడు ప్రత్యక్ష యుద్ధాలుగా పరిణమిస్తున్నాయి. దశాబ్దాల క్రితం జపాన్‌లోని హీరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా జరిపిన బాంబుదాడి ఈ కోవకు చెందినదే. ఈ దాడివల్ల ఆ నగరాలు నేటికీ కల్లోల భరితంగానే ఉన్నాయి. ఇప్పటికీ ఆ దాడి అక్కడ భవిష్యత్తు తరాల జీవన గమనాలపై ప్రభావం చూపుతూనే ఉంది. ఒకప్పటిలా నేటి యుద్ధం కర్రకు కర్ర, కత్తికి కత్తి, బల్లెంకు బల్లెం ఒరిగేది కాదు. ఆయుధానికి తనామనా ఉండదు. ఎవరికైనా మరణశాసనాన్ని లిఖిస్తుంది. ఎవరి కుత్తుకలైనాకోయగలదు. అణ్వాయుధాలైతే మరీనూ. నేటి అణుయుద్ధాలు యావత్తు ప్రపంచపు మానవ జీవన భౌతిక, రసాయన మూలాలను దహించేస్తాయి. నేటి యుద్ధాల వల్ల ప్రకృతి వినాశనానికి పరిమితులే ఉండవు. బాంబు పేలుళ్లు, విష రసాయనాల వల్ల గాలి, నీరు, ఆహారంతో పాటు అశేష సహజ వనరుల నాశనం తప్పడం లేదు. దీనివల్ల భూమిపై నివసించే సకల జీవరాసుల మనుగడ ప్రమాదంలోకి నెట్టబడుతుంది. తద్వారా జీవవైవిధ్యం తీవ్రంగాదెబ్బతింటున్నది. ఇంకా మిలియన్ల కొద్దీ సైనికులు, పౌరులు మరణించడం, వైకల్యానికి గురికావడం చూస్తున్నాం. దాంతో ప్రజలు నిరాశ్రయులై కుటుంబాలకు కుటుంబాలు విడిపోయిమానసిక వేదనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారు. దాంతో వారి భవిష్యత్తు అంధకారం అవుతున్నది. ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు పూర్తిగాదెబ్బతినడంతో దేశాభివృద్ధి కుంటుపడుతుంది. ఇండ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, రవాణా వ్యవస్థ ధ్వంసం కావడంతో ప్రజాధనం వృధా అవుతున్నది. దేశ వనరులన్నీ ఆయుధాలు కొనుగోలుకే ఖర్చు కావడంతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతున్నది. దాంతో సంబంధిత దేశాలు తీవ్ర దారిద్ర్యంలోకి కూరుకుపోతాయి. యుద్ధంలో అణ్వాయుధాలు ఉపయోగించడంతో తరతరాల వరకు భూమి నివాసయోగ్యం కాకుండాపోయే ప్రమాదముంది. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం 2010-20మధ్య కాలంలో ఉష్ణమండల అరణ్యాలు అంతరించిన ప్రదేశాల్లో 43శాతంఅటవీ భూములు యుద్ధ ప్రభావ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రపంచంలో విలువైన జీవవైవిధ్య సంపద ఉన్న 200 ప్రదేశాల్లో 90శాతం ప్రాంతాలపై యుద్ధాలు, సాయుధ ఘర్షణలే తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో 5.5శాతం సైనిక కార్యకలాపాలే కారణమని యు.ఎన్.ఒ అంచనా వేసింది. ఇజ్రాయిల్ హమాస్ పోరువల్ల గాజాలో 95శాతం నీటివనరులు కలుషితమయ్యాయి. ఇలాంటి గణాంకాలు ఎన్నో ఉదాహరణగా ఇవ్వొచ్చు. ఐతే యుద్ధాలవల్ల లాభం పొందేవాళ్ళున్నారా? అనే ప్రశ్నకు జవాబుగా, ఆయుధ తయారీ కంపెనీలు లాభపడడం, చిన్న చిన్నదేశాల చమురు తయారీ కేంద్రాలపై సామ్రాజ్యవాదులు ఆధిపత్యం చెలాయించడం, చమురు ఉత్పత్తిబేరల్ రేట్లు గణనీయంగా పెంచి అమ్ముకోవడం, యుద్ధవిజేతలు సరిహద్దు భూభాగాలలోకి చొచ్చుకుపోవడం, సహజవనరులను ఆక్రమించుకోవడం, ఇవన్నీ ఒకటికొకటి వచ్చిచేరతాయి. ఐతే ఇది మొత్తం సమాజానికి ఉపయోగపడేదికాదు. కాబట్టి ఇలాంటి వారిని అంతర్జాతీయ సమాజంగుర్తించి బహిష్కరించాలి. ●

# నిధుల్లేని పంచాయతీలతో అభివృద్ధి సాధ్యమా?



ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం అనేది కేవలం ఒక తేదీ కాదు. ఇది భారత ప్రజాస్వామ్యానికి నిజమైన మూలాధారమైన గ్రామ పాలన వ్యవస్థను గుర్తు చేసే రోజు. దేశ అభివృద్ధి నగరాల్లో మాత్రమే కాదు, గ్రామాల్లోనే నిజమైన బలాన్ని పొందుతుంది అన్న సత్యాన్ని ఈ రోజు మళ్లీ మన ముందుకు తెస్తుంది. 'గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలు' అన్న మహాత్మా గాంధీ మాటలు ఇప్పటికీ ఎంత ప్రాసంగికమో ఈ సందర్భం మనకు స్పష్టంగా చూపిస్తుంది. భారతదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ 1992లో 73వ రాజ్యాంగ సవరణతో బలమైన స్థాయికి చేరింది. గ్రామస్థాయిలో ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది. సర్పంచ్ నుండి జిల్లా పరిషత్ వరకు మూడు స్థాయిల్లో ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతూ, గ్రామ సమస్యలకు గ్రామంలోనే పరిష్కారం చూపే విధానంఅమలులోకి వచ్చింది. ఇది ప్రజాస్వామ్యాన్ని 'బాల్కనీ నుంచి బాటలోకి' తీసుకువచ్చిన పెద్ద మార్పుగా చెప్పవచ్చు. అయితే, నేటి పరిస్థితులు చూస్తే ఈ వ్యవస్థ తన అసలు లక్ష్యానికి ఎంతవరకు చేరుకుందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అనేక గ్రామాల్లో పంచాయతీలు ఇంకా నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడుతున్నాయి. నిర్ణయాధికారం పూర్తిగా స్థానిక సంస్థల చేతిలో లేకపోవడం, రాజకీయ జోక్యం, అభివృద్ధి పనుల్లో పారదర్శకత లోపం వంటి సమస్యలు గ్రామ పాలనను కొంత మేర బలహీనపరుస్తున్నాయి. మరోవైపు, సానుకూల మార్పులు కూడా కనిపిస్తున్నాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమం వల్ల గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయి. జనన, మరణ ధృవపత్రాలు, ఆస్తి పన్ను చెల్లింపులు వంటి సేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులోకి రావడం ప్రజలకు పెద్ద ఉపశమనం. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు



చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలు గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాయి. ప్రత్యేకంగా మహిళల భాగస్వామ్యం పంచాయతీ రాజ్ వ్యవస్థలో గణనీయంగా పెరిగింది. మహిళా రిజర్వేషన్ల కారణంగా అనేక గ్రామాల్లో మహిళలు సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా బాధ్యతలు తీసుకుంటున్నారు. ఇదిగ్రామపాలనలో కొత్త దృక్పథాన్ని తీసుకువచ్చింది. కానీ కొన్ని చోట్ల 'ప్రాక్సీ పాలన" సమస్య ఇంకా కొనసాగుతోంది. మహిళా ప్రతినిధుల స్థానంలో కుటుంబ సభ్యులు నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. గ్రామాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, నీరు, విద్యుత్ మాత్రమే కాదు. ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు కూడా సమానంగా అభివృద్ధి చెందాలి. కానీ ఇప్పటికీఅనేక గ్రామాల్లో ప్రాథమిక వైద్య సదుపాయాలు తక్కువగానే ఉన్నాయి. యువత ఉద్యోగాల కోసం పట్టణాలకు వలస వెళ్తుండటం గ్రామ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఇది గ్రామాలు బలపడాల్సిన అవసరాన్ని మరింత స్పష్టం చేస్తుంది. ఇక పంచాయతీ రాజ్‌వ్యవస్థను బలోపేతంచేయడానికి స్థానిక నాయకత్వం కీలకం. సర్పంచ్‌లు కేవలం పదవులుగా కాకుండా బాధ్యతగా వ్యవహరించాలి. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజల అభిప్రాయాలను నిర్ణయాల్లో ప్రతిబింబించడం, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడం ఇవన్నీ అత్యంత అవసరం. ప్రజల భాగస్వామ్యంలేకుండా గ్రామపాలన బలపడదు. ఓటు వేసిన తరువాత బాధ్యత ముగిసిపోదు. గ్రామ అభివృద్ధిలో ప్రతి పౌరుడు ఒక భాగస్వామి కావాలి. ప్రశ్నించడం, సూచించడం, పర్యవేక్షించడం ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని జీవం కలిగించే అంశాలు. నేటి టెక్నాలజీ యుగంలో గ్రామాలు కూడా స్మార్ట్ గ్రామాలుగా మారే అవకాశంఉంది. ఇంటర్నెట్, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్యా వనరులు గ్రామాలకు చేరితే వలసల సమస్య తగ్గుతుంది. గ్రామాల్లోనే అవకాశాలు ఏర్పడితే దేశసమతుల అభివృద్ధి సాధ్యం అవుతుంది. పంచాయతీ రాజ్ వ్యవస్థ కేవలం ఒక పరిపాలనా నిర్మాణం కాదు. అది భారత ప్రజాస్వామ్యానికి మూలస్థంభం. గ్రామాలు బలపడితేనే దేశం బలపడుతుంది. గ్రామాల్లో పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన నాయకత్వం కలిస్తే'గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు' అనే మాట నిజమైన అభివృద్ధి రూపం దాల్చుతుంది. ●

# అభివృద్ధి వెలుగుల్లోనూ మిగిలిన చీకట్లు!

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత దశాబ్దంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వం విశేష ప్రగతిని సాధించిందని అధికార వర్గాలు తరచూ పేర్కొంటున్నాయి. రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, నగరాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ వంటి రంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందనే అభిప్రాయం విస్తృతంగా ప్రచారం పొందుతోంది. ఈ మెరుగైన అభివృద్ధి చిత్రానికి వెనుక దాగిఉన్న అసమానతలు, ముఖ్యంగా అట్టడుగు వర్గాల జీవన పరిస్థితులు, ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. తెలంగాణలోమొత్తం కుటుంబాలలో సుమారు 13శాతం కుటుంబాలకు ఇప్పటికీ మరుగుదొడ్లు లేవు. ఇది కేవలం ఒక సౌకర్యం లోపం మాత్రమే కాదు, ఇది ప్రజల ఆరోగ్యానికి, గౌరవానికి, ముఖ్యంగా మహిళల భద్రతకు సంబంధించిన అంశం. ఓపెన్ డెఫికేషన్ సమస్య ఇంకా పూర్తిగా నిర్మూలించబడలేదని ఈ గణాంకం తెలియజేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండడం గమనార్హం. ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేసినప్పటికీ, వాటి ఫలితాలు సమానంగా అందరికి చేరలేదనే విషయం స్పష్టమవుతోంది. అదే విధంగా, రాష్ట్రంలో 6.56 లక్షల కుటుంబాలకు, అంటే దాదాపు 5.8 శాతం కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేదు. విద్యుత్ లేకపోవడం అనేది కేవలం దీపం వెలగకపోవడమే కాదు, ఇది విద్య, ఉపాధి, జీవన ప్రమాణాలపై నేరుగా ప్రభావం చూపుతుంది. విద్యుత్ లేకుండా పిల్లలు చదువు కొనసాగించడం కష్టతరం అవుతుంది. చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోతాయి. ఇంకా ఆందోళన కలిగించే అంశం తాగునీటి సమస్య. రాష్ట్రంలోని 21.2 శాతం కుటుంబాలకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో లేదు. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, పిల్లల పోషకాహార లోపం వంటి సమస్యలు ఈ లోపం వల్ల మరింత పెరుగుతాయి. మిషన్ భగీరథ వంటి భారీ పథకాలు అమలులో ఉన్నప్పటికీ, వాటి లాభాలు ప్రతి ఇంటికి చేరడం లేదనే అనుమానం కలుగుతోంది. ఆర్థిక పరిస్థితుల విషయానికి వస్తే, సుమారు 6.8 శాతం కుటుంబాలు అప్పులు



కోసం ఇంకా మని లెండర్లపై ఆధారపడుతున్నాయి. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఇంకా అనధికార రుణ వ్యవస్థ బలంగా కొనసాగుతోందని సూచిస్తుంది. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, అట్టడుగు వర్గాలకు అవి సులభంగా చేరడం లేదనే విషయం దీనివల్ల తెలుస్తోంది. ఇంకా 7శాతం కుటుంబాలు వివాహాలు లేదా వైద్య అవసరాల కోసం అప్పులు తీసుకుంటున్నాయి. ఇది సామాజిక ఒత్తిళ్లు, ఆరోగ్య ఖర్చులు కుటుంబాలపై ఎంత భారంగా ఉన్నాయో తెలియజేస్తోంది. ఇంటి పరిస్థితులు కూడా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయి. రాష్ట్రంలోని 63.5 శాతం కుటుంబాలు రెండు గదులు లేదా అంతకంటే తక్కువ గదులు ఉన్న ఇళ్లలో నివసిస్తున్నాయి. కేవలం 27.5 శాతం కుటుంబాలు మాత్రమే మూడు లేదా అంతకంటే ఎక్కువ గదులు ఉన్న ఇళ్లలో నివసిస్తున్నాయి. ఇది జీవన ప్రమాణాల్లోని తేడాలను స్పష్టంగా చూపిస్తుంది. పెద్ద కుటుంబాలు చిన్నఇళ్లలో నివసించడంవల్ల ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత గోప్యత లోపం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అన్ని సమస్యలలో ముఖ్యంగా ప్రభావితమవుతున్నవారు ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అట్టడుగు వర్గాల ప్రజలు. ఆధునిక సమాజంలో అవసరమైన మౌలిక వసతులు వీరికి ఇంకా అందుబాటులో లేవు. అభివృద్ధి ఫలాలు సమానంగా పంచబడకపోవడం వల్ల ఈ వర్గాలు మరింత వెనుకబడుతున్నాయి. ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ సమాజానికి చెందిన కుటుంబాలు మరింత తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సమాజంలో అంగీకారం లేకపోవడం, ఉపాధి అవకాశాల కొరత, నివాస స్థలాల లోపం వంటి సమస్యలు వీరిని మరింత పేదరికంలోకి నెట్టేస్తున్నాయి. అభివృద్ధి అనేది కేవలం జిడిపి వృద్ధి లేదా భారీ ప్రాజెక్టుల నిర్మాణం మాత్రమే కాదు. అది ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో కొలవాలి. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులుఅందించకపోతే, ఆ అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. మౌలిక వసతుల పంపిణీలో ప్రాంతీయ, సామాజిక అస మానతలను తగ్గించాలి. అట్టడుగు వర్గాలకు ప్రత్యేకంగా లక్ష్యంగా పెట్టుకుని పథకాలు రూపొందించాలి. బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించాలి. ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవాలి. మొత్తానికి తెలంగాణ అభివృద్ధి కథలో ఇంకా పూర్తి కాని అధ్యాయాలు ఉన్నాయి. ఆ అధ్యా యాలు అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాల మెరుగుదల తోనే పూర్తవుతాయి. ఇదే నిజమైన ప్రజాస్వామ్య అభివృద్ధికి మార్గం. ●



# మే 4న స్వీట్లు పంచుతాం

## బెంగాల్ ఎన్నికల్లో బిజెపిదే విజయం

### రెండో విడత ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**కోల్‌కత్తా, ఏప్రిల్ 23:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదేనని ప్రధాని నరేంద్రమోదీ ధీమా వ్యక్తంచేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా తాము స్వీట్లు పంచుతామని చెప్పారు. బెంగాల్‌లో రెండు విడతల ఎన్నికల పోలింగ్లో భాగంగా ఇవాళ తొలి విడత పోలింగ్ జరుగుతోంది. ఈ నెల 29న రెండో విడత పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో రెండో విడత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రధాని ప్రచారం చేస్తున్నారు. ఇవాళ నదియా జిల్లా లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటింగ్ భారీగా జరిగిన ప్రాంతాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని అన్నారు. ఈసారి భారీగా పోలింగ్ జరుగుతున్నదని, బీజేపీ గెలుపు ఖాయమని చెప్పారు. మే 4న బీజేపీ చరిత్ర సృష్టించనుందని అన్నారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందామని సభకు వచ్చిన జనాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీని ఓటర్లు సాగనంపబోతున్నారని అన్నారు. మే 4న ఎన్నికల ఫలితాల తర్వాత స్వీట్లతోపాటు ఝాల్‌ముడి కూడా పంచుతామని ప్రధాని అన్నారు. ఇటీవల బెంగాల్‌లో నేను ఝాల్‌ముడి తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలను సంధించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. ఎన్నికల ప్రచార సభకు బెంగాల్ ప్రజలు, బీజేపీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టీఎంసీ, కాంగ్రెస్ కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీకి శిక్ష విధించాలని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తున్న ఈసీకి అభినందనలని మోడీ పేర్కొన్నారు. బెంగాల్‌లో టీఎంసీ జంగిల్ రాజ్ ముగిస్తున్నాం. మమత పాలనలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి.

మమత చేసిన దుర్మార్గాలపై విచారణ చేస్తాం. బెంగాల్‌లోకి చొరబాటు దారులను టీఎంసీ ప్రోత్సహిస్తుంది. సరిహద్దు భద్రతను, ప్రమాదంలో పడేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిఎంసి అవినీతిని కక్కిస్తాం అని మోడీ అన్నారు. మలివిడత పోలింగ్ కోసం ఈనెల 29న ఓటింగ్ జరుగనుంది. రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ బెంగాల్లో పర్యటించారు. ఈ ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

**ప్రజలు మమతా బెనర్జీని తుడిచిపెట్టేస్తారు:సువేందు**

పశ్చిమబెంగాల్ ప్రజలు మమతా బెనర్జీని తుడిచిపెట్టేస్తారని ఆ రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, బీజేపీ నేత సువేందు అధికారి దీమా వ్యక్తం చేసారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి మమతా బెనర్జి పోటీ చేస్తున్న భవానీపూర్, నంద్రిగ్రామ్ రెండు నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. బెంగాల్ రెండు విడతల పోలింగ్‌లో భాగంగా ఇవాళ తొలివిడత పోలింగ్ జరుగుతోంది. ఈ నెల 29న రెండో విడత పోలింగ్ జరగనుంది. నందిగ్రామ్‌లో తొలి విడతలోనే పోలింగ్ జరుగుతోంది.

సువేందు అధికారి ఓటు నందిగ్రామ్‌లో ఉండటంతో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. ఇవాళ తాను పోలింగ్ కేంద్రం దగ్గరికి రాగానే ఓ వివాహిత మహిళ తనను సమీపించి ఏడ్చిందని, హిందువులను కాపాడాలని కోరిందని చెప్పారు. మళ్లీ మమతాబెనర్జి అధికారంలోకి వస్తే నంద్రిగ్రామ్ కూడా ముర్షిదాబాద్‌లా అవుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారన్నారు.

అదే విధంగా తాను 65 నుంచి70 ఏళ్ల వయస్సున్న ఓ వృద్ధురాలిని ఓటు ఎవరికి వేస్తున్నావని పలకరించానని, అందుకు ఆమె బదులిస్తూ మమతా బెనర్జీకి గుణపాఠం చెబుతానని అన్నారని సువేందు తెలిపారు. ఈ ఎన్నికల్లో బెంగాలీ ప్రజలు మమతాబెర్జీని తుడిచిపెట్టేస్తారని అన్నారు.

# తమిళనాడు, బెంగాల్ పోలింగ్

## ఓటర్లకు స్వాగతం పలికిన రోబోలు



**వేలూరు, ఏప్రిల్ 23:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వేలూరు జిల్లాలో ఒక వినూత్న, ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. కొన్ని ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు రోబోలు స్వాగతం పలికాయి. టెక్నాలజీ, ప్రజాస్వామ్యం మేళవించిన ఈ ప్రయోగం ఓటర్లకు సరికొత్త అనుభూతిని అందించింది. వేలూరు జిల్లాలోని గుడియాట్టం, వేలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. గుడియాట్టంలోని ప్రభుత్వ మున్సిపల్ హయ్యర్ సెకండరీ పాఠశాల కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు ఆశ్చర్యపోయారు. అక్కడ చీరకట్టులో అలంకరించిన ఒక రోబో, చేతిలో పువ్వులు, చాక్లెట్లతో నిలబడి ఓటర్లను తమిళంలో మర్యాదపూర్వకంగా పలకరించింది. ఎండ తీవ్రత నుంచి ఎలా సురక్షితంగా ఉండాలో సూచనలు కూడా ఇచ్చింది. ఇదే తరహాలో వేలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రభుత్వ ముస్లిం హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన రోబో మరింత ప్రత్యేకం. ఇది తనలో అమర్చిన సెన్సర్ల సహాయంతో ఓటర్లకు షేక్‌హ్యాండ్ ఇచ్చి పలకరించింది. పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు మొబైల్ ఫోన్లను నిర్దేశిత కౌంటర్లలో జమ చేయాలని స్పష్టమైన సూచనలు చేసింది ఈ రోబోలు కేవలం స్వాగతం పలకడానికే పరిమితం కాలేదు. ఓటర్లకు అవగాహన కల్పించడంలోనూ కీలక పాత్ర పోషించాయి. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్లను ఉపయోగించుకోవాలని నిరంతరం ప్రకటనలు చేశాయి. అలాగే, పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ సౌకర్యం అందుబాటులో ఉందని కూడా తెలియజేశాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,427 పోలింగ్ కేంద్రాల్లో రెండింటిలో ఈ ప్రయోగాన్ని చేపట్టామని అధికారులు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేయడం, ప్రజలకు టెక్నాలజీని చేరువ చేయాలన్న లక్ష్యంతో ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

## పోలింగ్ కేంద్రానికి నూతన వధూవరులు!

**కాంచీపురం, ఏప్రిల్ 23:** ఓటు హక్కు వినియోగంపై చాలా మంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న తరుణంలో ఓ నవ వరుడు ప్రజాస్వామ్యంపై తనకున్న బాధ్యతను చాటి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. పెళ్లి పీటల మీద నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. ఈ స్ఫూర్తిదాయక ఘటన తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో చోటుచేసుకుంది. కాంచీపురం జిల్లాకు చెందిన ఓ యువకుడికి ఈరోజే వివాహం జరిగింది. పెళ్లి తంతు పూర్తయిన వెంటనే, అతను తన నవ వధువుతో కలిసి సమీపంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నాడు. పెళ్లి దుస్తుల్లోనే క్యూలో నిల్చొని ఓటు వేశాడు. వ్యక్తిగత వేడుక ఎంత ముఖ్యమో, దేశ పౌరుడిగా ప్రజాస్వామ్య బాధ్యత కూడా అంతే ముఖ్యమని అతను నిరూపించాడు. ఈ రోజుల్లో పార్టీలు, సినిమాలు వంటి సాకులతో యువత ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారని విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ పెళ్లికొడుకు చూపిన చొరవను పలువురు అభినందించారు. పోలింగ్ కేంద్రంలోని అధికారులు, సిబ్బంది అతడిని చూసి శభాష్ అని ప్రశంసించారు. ఈ ఘటనతో పెళ్లికి వచ్చిన బంధుమిత్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

## ఓటర్ల కంటే ముందే వచ్చిన ఏనుగు!

**ఝార్‌గ్రామ్, ఏప్రిల్ 23:** పశ్చిమ బెంగాల్‌లోని జార్‌గ్రామ్ అడవుల్లో రామ్‌లాల్ ఏనుగు అంటే అందరికీ సుపరిచతమే. గురువారం ఆ ఐరావతం అందర్నీ విస్మయా నికి గురి చేసింది. ఓటర్ల కన్నా ముందే పోలింగ్ బూత్ చేరుకుని అందరినీ పలకరించింది. గురువారం బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. జార్‌గ్రామ్‌లోని జిట్‌సోల్ ప్రైమరీ స్కూల్ వద్దకు రామ్‌లాల్ ఏనుగు వచ్చింది. తెల్లవారుజామున పోలింగ్ సిబ్బంది బూత్‌లో సెటిల్ అవుతున్న సమయంలో ఇంకా అక్కడికి పెద్దగా ఓటర్లు రాక ముందే రామ్‌లాల్ చేరుకున్నది. ఆ బూత్ ముందున్న ఎన్నికల వాహనాన్ని కూడా అది తనిఖీ చేసింది. అయితే ఓటింగ్ కోసం బూత్‌కు వచ్చే ఓటర్లు అంతా రామ్‌లాల్‌ను చూసి షాకయ్యారు. జంగల్‌మహల్ అడవుల్లో తిరిగే రామ్‌లాల్ తెల్లవారగానే పోలింగ్ బూత్ వద్దకు రావడంతో కొంత ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న లోధాశులి అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని ఆ టస్కర్‌ను సైలెంట్‌గా పంపించేశారు.

రామ్‌లాల్ ఏనుగు అక్కడ నుంచి వెళ్లిపోగానే మళ్లీ పోలింగ్ సజావుగా సాగింది. జంగల్‌మహల్ ఏరియాలో ఏనుగుల సంచారం ఎక్కువే. ఆ సమస్యను గుర్తించే అధికారులు వివిధ రకాల ఏర్పాట్లు చేశారు. ఎలిఫెంట్ ట్రాకర్స్, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఐరావత్ వెహికల్ సర్వీస్ కూడా సిద్ధం చేశారు. ఇక రామ్‌లాల్ ఏనుగు స్థానికులకు సుపరిచితమే.

# అమెరికాను వదిలేస్తాం!

## 40శాతం అమెరికన్ భారతీయుల్లో పెరుగుతున్న విముఖత

**వాషింగ్టన్, ఏప్రిల్ 23:** చాలామంది భారతీయులకు, నిన్నటి వరకు అమెరికా అంతిమ గమ్యస్థానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఎంతోమంది మది నుంచి అమెరికా కల నెమ్మదిగా కనుమరుగవుతోంది. అమెరికాలో స్థిరపడాలని కలలు కనేవారి సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. అక్రమవలసల కట్టడిపేరుతో హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారుల కఠిన కార్యాచరణమరింతగా అమెరికా పట్ల విముఖతను పెంచుతోంది. అంతర్జాతీయ సంస్థ కార్నెగీ ఎండోమెంట్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, భారతీయ అమెరికన్ సమాజంలో రోజురోజుకీ ఆందోళన పెరుగుతోంది. ఎంతోమంది ఇప్పుడు అమెరికాను విడిచి వెళ్లాలనుకుంటున్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్ల కారణంగా 40 శాతం మంది భారతీయ అమెరికన్లు అగ్రరాజ్యం నుంచి శాశ్వతంగా వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నారని సర్వేలో వెల్లడైంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆయన అనుసరిస్తున్న విధానాలు వలసదారులను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా అమెరికన్లకు మాత్రమే అనే నినాదం పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలో జీవన విధానాలు, ట్రంప్ ప్రభుత్వం తీరుపై యూగోవ్‌తో కలిసి కార్నెగీ ఎండోమెంట్ నిర్వహించిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. వివిధ కారణాల వల్ల, ప్రతి 10 మందిలో నలుగురు భారతీయులు అమెరికాను వీడాలనుకుంటున్నారు. రాజకీయ అస్థిరత కారణంగా తాము వెళ్లాలనుకుంటున్న వారు 58 శాతం మంది ఉన్నారు. జీవన వ్యయం కారణంగా 54 శాతం, వ్యక్తిగత భద్రత ఆందోళనతో 41 శాతం మంది అమెరికాను వీడాలని భావిస్తున్నారు. రెండోసారి ట్రంప్ పాలనపై తాము అసంతృప్తితో ఉన్నట్లు 71 శాతం మంది తెలిపారు. 2024-25 గణాంకాల ప్రకారం, అమెరికాలో 54 లక్షల మందికి పైగా భారతీయులు ఉన్నారు. అమెరికాలో వీరి వాటా 1.5 శాతంగా ఉంది.

ట్రంప్ అధికారంలోకి రాకముందు నుంచే అమెరికాకు అక్రమ వలసలు తగ్గుముఖం పట్టాయని ఈ సర్వే తెలిపింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక చట్టబద్ధ వలసలు భారీగా తగ్గినట్లు ఈ సర్వే తెలిపింది. అత్యధికంగా హెచ్1బీ వీసాలపై ఈ ప్రభావం కనిపించింది. గత సంవత్సరంలో ఈ వీసాల జారీ 25 శాతం మేర తగ్గిందని తెలిపింది. లక్ష డాలర్ల ఫీజు అమల్లోకి వచ్చాక వీసాల కోసం కంపెనీల నుంచి పిటిషన్లు 87 శాతం తగ్గుముఖం పట్టినట్లు ఈ సర్వే తన నివేదికలో తెలిపింది.



# భారత్, చైనాలు నరక కూపాలు!

## ట్రంప్ ట్రూత్‌పోస్టులో వెళ్లగక్కిన విద్వేషం

**వాషింగ్టన్, ఏప్రిల్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. భారత్, చైనా వంటి దేశాలను నరక కూపాలు అని సంబోధిస్తూ, అక్కడి వలసదారులపై జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన ఒక పోస్టును ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్ చేశారు. ఈ చర్యతో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ రాసిన ఈ పోస్టులో అమెరికాలో పుట్టుకతో పౌరసత్వం కల్పించే చట్టంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరిచారు. భారత్, చైనా వంటి దేశాల నుంచి ప్రజలు గర్భంతో ఉన్న తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా ఆ పిల్లలు తక్షణమే అమెరికా పౌరులుగా మారుతున్నారని ఆయన ఆరోపించారు. ఇక్కడ పుట్టిన బిడ్డ తక్షణమే పౌరుడు అవుతాడు. ఆ తర్వాత వాళ్లు చైనా, భారత్ లేదా భూమిపై ఉన్న మరో నరక కూపం నుంచి తమ పూర్తి కుటుంబాన్ని ఇక్కడికి తీసుకొస్తారని సావేజ్ తన లేఖలో రాశారు. అంతటితో ఆగకుండా భారత్, చైనా నుంచి వచ్చిన వలసదారులను ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లని అభివర్ణించారు. ఈ దేశానికి మాఫియా కుటుంబాలు చేసిన నష్టం కంటే వీరే ఎక్కువ చేశారు. మన జెండాను అవమానించారు. మనల్ని దోచుకున్నారంటూ తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. కాలిఫోర్నియాలోని టెక్ కంపెనీలలో భారతీయులు, చైనీయుల ఆధిపత్యం పెరిగిపోయిందని, శ్వేతజాతీయులకు ఉద్యోగాలు దొరకడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ట్రంప్ ఈ లేఖను పోస్ట్ చేయడానికి ఒక రోజు ముందు, అమెరికా మినహా ప్రపంచంలో ఏ దేశంలోనూ పుట్టుకతో పౌరసత్వం ఇచ్చే విధానం లేదని ఓ ఇంటర్వ్యూలో తప్పుడు ప్రకటన చేశారు. వాస్తవానికి అమెరికా పొరుగు దేశాలైన కెనడా, మెక్సికో సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 36 దేశాల్లో ఆ గడ్డపై పుట్టిన వారికి పౌరసత్వం కల్పించే విధానం అమల్లో ఉంది. ఇప్పుడు సావేజ్ రాసిన జాత్యహంకార లేఖను ట్రంప్ స్వయంగా పంచుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

## ముస్లిం అనుకుని సిక్కు మహిళను టార్గెట్ చేసా!

### కోర్టులో స్వయంగా వెల్లడించిన నిందితుడు - నేడు శిక్ష ఖరారు

**లండన్, ఏప్రిల్ 23:** ముస్లిం అనుకుని సిక్కు మహిళపై తాను లైంగిక దాడిచేసానని నిందితుడు స్వయంగా కోర్టులో అంగీకరించిన వైనం ఆశ్చర్యం కలిగించింది. ప్రస్తుతం బర్మింగ్‌హామ్ క్రౌన్ కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఆ కేసులో శుక్రవారం అతనికి శిక్షను ఖరారు చేయనున్నారు. అత్యాచారం చేసే క్రమంలో మహిళను బూతులు తిట్టాడు. ముస్లిం అనుకుని ఆమెను వేధించినట్లు అంగీకరించాడు. 2025 అక్టోబర్‌లో వాల్‌సాల్ ఏరియాలో దాడి ఘటన జరిగింది. అత్యాచారం, దొంగతనం, బెదిరింపులు, దాడికి పాల్పడినట్లు అతను ఒప్పుకున్నాడు. దాడి జరగడానికి ముందు బాధిత అమ్మాయికి, నిందితుడికి ఎటువంటి పరిచయం లేదని కోర్టు తేల్చింది. పనిప్రదేశం నుంచి బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో జాన్ ఆష్బీ ఆమెను వెంబడించాడు. ఓ కర్రతో అతను ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో శబ్దం రావడంతో ఆ అమ్మాయి బాత్రూం డోర్ వేసుకున్నది. నిందితుడు జాన్ గట్టిగా ఆ డోర్‌ను నెట్టేసి లోపలికి ప్రవేశించాడు. రూమ్‌లో లైట్లు ఆర్పేసి తాను కేవలం సరదా కోసం ఇక్కడకు వచ్చినట్లు చెప్పాడు. ఆ తర్వాత కర్రతో ఆమెను కొట్టాడు. గొంతు నలిమాడు.

బాత్‌టబ్‌లోకి నెట్టేశాడు. హాట్‌వాటర్‌ను ఆన్ చేశాడు. ఆ సమయంలో ఇస్లామోఫోబిక్ మాటలతో ఆ మహిళను తిట్టాడు. ముస్లిం అనుకుని ఆమెను తీవ్రంగా దుర్భాషలాడాడు.

## అధిక ఉష్ణోగ్రతలు మెదడుపైనా ప్రభావం..

### శాస్త్రీయ అధ్యయనంలో ఆసక్తికర అంశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** భారత్‌లో వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మాత్రమే కాదు. వాతావరణంలో అధికమవుతున్న తేమ, వేసవి తాపం ప్రాణాంతకంగా మారుతోంది. శరీరం తనను తాను చల్లబరుచుకునే సహజ ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలిగిస్తోందని, ఈ స్థితిని అర్థం చేసుకోవడానికి వెట్‌బల్బ్ ఉష్ణోగ్రత అనే అంశంపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం పొడి వేడి మాత్రమే కాకుండా, అధిక తేమతో కూడిన వేడి కూడా ప్రమాదకరమని నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించిన 2026 నాటి తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వెట్‌బల్బ్ ఉష్ణోగ్రత అంటే గాలిలోని వేడి, తేమ రెండింటినీ కలిపి కొలిచే ఒక పద్ధతి. చెమట పట్టడం ద్వారా మానవ శరీరం ఎంత సమర్థవంతంగా చల్లబడుతుందో ఇది సూచిస్తుంది. సాధారణ గాలి ఉష్ణోగ్రతలా కాకుండా, గాలిలోని తేమ ఆవిరి అవ్వడం ద్వారా చేరగల అత్యల్ప ఉష్ణోగ్రతను ఇది తెలియజేస్తుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, చెమట పట్టే ప్రక్రియ సరిగా పనిచేయదు. దీనివల్ల శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం చాలా కష్టమవుతుందని నరాల వైద్యనిపుణుడు డాక్టర్ గౌరవ్ బాత్రా వెల్లడించారు. గందరగోళం, తలనొప్పి, అయోమయం వంటివి మెదడుపై వేడి ప్రభావం చూపుతోందనడానికి తొలి సంకేతాలు. తీవ్రమైన సందర్భాల్లో మూర్ఛ రావడం లేదా కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంది. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి అధిక వెట్‌బల్బ్ ఉష్ణోగ్రతలు మరింత ప్రమాదకరం. గతంలో తలకు గాయాలైన వారు, బ్రెయిన్ సర్జరీ జరిగిన వారు, ఇంట్రాక్రానియల్ బ్లీడింగ్ సమస్యలు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇలాంటి వారిలో శరీర ఉష్ణోగ్రత కొద్దిగా పెరిగినా కపాలంలో ఒత్తిడి పెరిగి, మెదడుకు సెకండరీ గాయం అయ్యే ప్రమాదం ఎక్కువ" అని డాక్టర్ బాత్రా వివరించారు. అధిక వేడి వల్ల రక్తపోటులో మార్పులు, డీహైడ్రేషన్‌కు సంబంధించిన రక్తం గడ్డకట్టే సమస్యలు పెరిగి, బ్రెయిన్ స్ట్రోక్ వంటివి సంభవించే అవకాశం ఉంది.

అధిక తేమ ఉన్నప్పుడు డీహైడ్రేషన్ వేగంగా జరుగుతుంది. దీనివల్ల శరీరంలో రక్తం పరిమాణం తగ్గి, మెదడుతో సహా కీలక అవయవాలకు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఈ కారణంగా ఆరోగ్యవంతుల్లో సైతం తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. అందుకే వాతావరణంలో మార్పుల నేపథ్యంలో కేవలం ఉష్ణోగ్రతను మాత్రమే కాకుండా వెట్‌బల్బ్ ఉష్ణోగ్రతపై కూడా అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం. తల తిరగడం, గందరగోళం, అధిక అలసట వంటి ప్రారంభ లక్షణాలను గుర్తించి, వెంటనే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తీవ్ర ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

### - సోషల్ మీడియాలో ఆ విడియోలు తొలగించాలని ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మను విచారణ నుండి తప్పించాలని కేజ్రీవాల్, ఇతరులు కోరిన కోర్టు విచారణల వీడియోలు ఉన్న సోషల్ మీడియా పోస్టులను తొలగించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఎదుట జరుగుతున్న విచారణల వీడియోలను "అనధికారికంగా" రికార్డ్ చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేసినందుకు కేజ్రీవాల్, పార్టీలోని ఇతర నాయకులు, అలాగే జర్నలిస్ట్ రవిష్ కుమార్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై కోర్టు ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. కోర్టు ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# మంటల్లో పశ్చిమాసియా

## హార్ముజ్ నుంచి తొలి ఆదాయం.. ఇరాన్ వెల్లడి



**టెహ్రాన్, ఏప్రిల్ 23:** హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ తొలిసారిగా టోల్ వసూలు చేసింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ హమీద్‌రెజా వెల్లడించారు. టోల్ మొత్తం తమ సెంట్రల్ బ్యాంక్ అకౌంట్‌లో జమ అయినట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే ఈ టోల్‌ను ఏ దేశపు నౌక నుంచి వసూలు చేశారనే దానిపై స్పష్టం లేదు. గతంలోనే ఇరాన్ టోల్ ప్రతిపాదనను తీసుకువచ్చింది. టోల్ నగదును తమ దేశ పునర్నిర్మాణం కోసం వినియోగిస్తామని కూడా పేర్కొంది. ఇరాన్ పెట్టిన కొత్త నిబంధనల ప్రకారం రుసుములు చెల్లిస్తున్న నౌకలను హార్ముజ్‌ను దాటేందుకు అనుమతిస్తోంది. తాజాగా ఒక ట్యాంకర్ జలసంధిని దాటడం కోసం 2 మిలియన్ డాలర్ల నగదు చెల్లించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే టెహ్రాన్ ఈ పన్ను వ్యవస్థను అధికారికం చేసిన సంగతి తెలిసిందే. నౌకల యజమానులు, అందులో ఉన్న సరకు, అవి చేరుకోవాల్సిన గమ్యస్థానాల గురించి పూర్తి సమాచారం టెహ్రాన్ అధికారులకు ముందే అందించాల్సి ఉంటుంది. సాధారణంగా ఒక బ్యారెట్ చమురుకు 1 డాలర్ టోల్ చెల్లించాలి. ఈ లెక్క ప్రకారం ఆ నౌకలో రెండు మిలియన్ బ్యారెళ్ల చమురు ఉంటే.. రెండు మిలియన్ డాలర్లు చెల్లించాల్సి వుంది. ఈ నగదును చైనీస్ యువాన్, క్రిప్టో కరెన్సీ రూపంలోనే అనుమతిస్తారు. ఒకసారి నౌకలకు సంబంధించిన టోల్ చెల్లింపులు పూర్తయ్యాక ఇరాన్ దక్షిణ తీర ప్రాంతాల నుంచి ఐఆర్‌జిసి నౌకలు వాటికి రక్షణగా వెళ్తాయని సమాచారం.

## ఇరాన్ అమెరికన్లు వెంటనే దేశం వీడి వచ్చేయాలి

### అమెరికా పౌరులకు ట్రంప్ సర్కార్ అలర్ట్

**టెహ్రాన్, ఏప్రిల్ 23:** ఇరాన్‌లో ఉన్న తమ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని అమెరికా ప్రభుత్వం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ తన గగనతలాన్ని పాక్షికంగా తెరిచిన నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ ఈ సూచన చేసింది. సోషల్ మీడియాలో ఈ మేరకు ఓ సందేశం విడుదల చేసింది. స్థానిక మీడియాను నిరంతరం గమనిస్తూ ఉండాలని, విమానాల సమాచారం కోసం కమర్షియల్ ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని అమెరికా పౌరులకు సూచించింది. విమానాలతో పాటు అర్మేనియా, అజర్‌బైజాన్, టర్కీ, తుర్క్‌మెనిస్థాన్ దేశాలకు భూమార్గం ద్వారా కూడా ఇరాన్‌ను వీడవచ్చని తెలిపింది. అయితే, ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్, పాకిస్థాన్‌ఇరాన్ సరిహద్దు ప్రాంతాలకు మాత్రం ప్రయాణించవద్దని స్పష్టం చేసింది. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు జరిపిన తర్వాత ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే సైనిక దాడులను నిలిపివేసినప్పటికీ, ఆర్థికంగా, సముద్ర మార్గంలో ఆంక్షలను మరింత తీవ్రతరం చేస్తున్నట్లు స్పష్టం చేసింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ సైనిక దాడులపై కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఆపరేషన్ ఎకనామిక్ ఫ్యూరీ, నావికాదళ దిగ్బంధం కొనసాగుతున్నాయని తెలిపారు.

## హాలీవుడ్ సినిమాను తలపించిన హార్ముజ్‌లో ఐఆర్జీసి దాడి

**టెహ్రాన్, ఏప్రిల్ 23:** హోర్ముజ్ జలసంధి వద్ద నౌకలపై ఇరాన్ నిర్వహించిన దాడి తీరును ఇరాన్ ఐఆర్‌జీసీ విడియోలు విడుదలచేసింది. కార్గో నౌకలపై కాల్పులు జరిపి, ఆ నౌకల్ని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ నావికా దళం అదుపులోకి తీసుకున్న తీరు మొత్తం వీడియోను ఇరాన్ విడుదల చేసింది. హోర్ముజ్‌లో మూడు వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసింది. మొదటగా నౌకలపై కాల్పులు జరిపింది. ఆ తర్వాత నౌకలోకి ప్రవేశించిన సైన్యం వాటిని తమ నియంత్రణలోకి తీసుకుంది. అక్రమంగా హోర్ముజ్ దాటేందుకు ప్రయత్నించినందునే తాము ఈ పని చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది. నౌకను సైన్యం స్వాధీనం చేసుకున్న తీరు హాలీవుడ్ సినిమాను తలపిస్తున్నట్లు ఉంది. సాయుధులైన సైనికులు..

ముసుగులు ధరించి, పడవలో కార్గో షిప్ వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత నిచ్చెన సహాయంతో పడవలోకి చేరుకున్నారు. నౌకను స్వాధీనం చేసుకున్నారు.

## చైనీయులకు పర్యాటక వీసాలు పునరుద్ధరించిన భారత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** చైనీయులకు పర్యాటక వీసాలను భారత్ పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. గల్వాన్ ఘర్షణ తర్వాత ఐదేళ్లుగా భారత్, చైనా మధ్య పర్యాటక వీసాలు నిలిచిపోయాయి. కొద్దికాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఇందులో భాగంగానే పర్యాటక వీసాల పునరుద్ధరణకు భారత్ శ్రీకారం చుట్టింది. చైనా జాతీయులకు ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన పర్యాటక వీసాలను పునరుద్ధరిస్తూ కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. పర్యాటక వీసాలపై కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే, చైనా, హాంకాంగ్ పౌరులకు పర్యాటక వీసాలు జారీ చేయడం కోసం ఈ మార్గదర్శకాలను విడుదల చేసిందని తెలుస్తోంది. దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి గత సంవత్సరం నుంచి ఆంక్షల సడలింపు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల ఒప్పందంతో విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. కైలాస్ మానస సరోవర్ యాత్రను కూడా తిరిగి ప్రారంభించారు. 2020లో భారత్‌చైనా సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణలు జరిగాయి. అప్పటి నుంచి చైనా జాతీయులకు భారత్ టూరిస్ట్ వీసాల జారీని నిలిపేసింది. టూరిస్టు వీసాల జారీలో పొరుగుదేశంతో ఉన్న సంబంధాలను సాధారణస్థితికి తీసుకురావడమే భారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉన్నందున వాటిని పునరుద్ధరిస్తున్నట్లు విదేశాంగశాఖ ప్రకటించింది. చైనా, హాంకాంగ్ పౌరులకు పర్యాటక వీసాలను జారీ చేయడం కోసం కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకొంది.



## యోగి నాయకత్వంలోనే ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలు

### - రానున్న ఎన్నికల్లో మహిళా ఓటర్ల పాత్ర అత్యంత కీలకం
### - బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టీకరణ

**కోల్‌కతా, ఏప్రిల్ 23:** వచ్చే ఏడాది జరగబోయే ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో మరో ప్రజాశీర్వాదం కోసం వెళ్తామని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వారసుడిగా యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ పేరు రాజకీయ వర్గాల్లో తీవ్ర జరుగుతున్న నేపథ్యంలో నబిన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అనే ప్రశ్నకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. యోగి నాయకత్వంలోనే ఎన్నికల రణక్షేత్రంలోకి వెళతామని ఆయన స్పష్టం చేశారు. "ఉత్తర్ ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథే మా ముఖచిత్రం. ప్రస్తుతం ఆయన నాయకత్వంలోనే ప్రభుత్వం నడుస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే మా సారథి" అని అన్నారు. 2017, 2022 విజయాల తర్వాత 2027లో కూడా ఘనవిజయం సాధించి యుపిలో బిజెపి హ్యాట్రిక్ సృష్టిస్తుంది" అని నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు నేరాలకు నిలయంగా ఉన్న యుపి, ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ వేలు, శాంతి భద్ర తలు, పారిశ్రామికాభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పేర్కొన్నారు. మోడీ-యోగి 'డబుల్ ఇంజిన్' సర్కార్ చేసిన పనులే ఓట్లు తెస్తాయన్నారు.



## డిజిపితో పదోన్నతి పొందిన ఐపిఎస్ అధికారుల భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** 1995, 1996 బ్యాచ్‌లకు చెంది డిజిపిలుగా పదోన్నతి పొందిన ఐపిఎస్ అధికారులు గురువారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. 1995 బ్యాచ్‌కు చెందిన వీరిశెట్టి వెంకటశ్రీనివాసరావు, స్వాతిలక్రా, మహేష్‌మురళీధర్ భగవత్‌తోపాటు 1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, డాక్టర్ అనిల్‌కుమార్ డిజిపిని కలిశారు.

## విజేతలకు నగదు రివార్డులు
## అందజేసిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి నగదు బహుమతులను అందజేశారు. రెండు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు "సెంట్రల్ ఫ్లాగ్ ఫండ్"నుంచి నగదు పురస్కారాలను అందజేశారు. ప్రథమ విజేతలకు రూ. 20,000, ద్వితీయ విజేతలకు రూ. 15,000, తృతీయ విజేతలకు రూ. 10,000 చొప్పున బహుమతులు ఖరారు చేశారు. విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కేటగిరీ1 (పీసీ నుంచి ఏఎస్ఐ వరకు):పని ప్రదేశాల్లో లింగ వివక్ష అనే అంశంపై నిర్వహించిన ఈ విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ బెటాలియన్‌కు చెందిన ధసరి ప్రశాంత్, కావేరి దీపిక ప్రథమ బహుమతులు సాధించారు. కరీంనగర్ పీటీసీకి చెందిన కె. రవికుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్‌కు చెందిన ఎ. రాజు ద్వితీయ బహుమతులు... కరీంనగర్ జిల్లా చొప్పదండి పీఎస్‌కు చెందిన పి. స్వర్ణలత, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఎ. శ్రీలత తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. కేటగిరీ2 (ఎస్ఐ ఆపై స్థాయి అధికారులు):క్షేత్ర స్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయడం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ములుగు జిల్లా ఆర్ఐ వెంకట నారాయణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డబ్ల్యూపీఎస్ ఎస్ఐ వై. మోనిక ప్రథమ స్థానంలో నిలిచారు. వరంగల్ పీటీసీ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్ ఆర్ఎస్ఐ ఎన్.వి.ఆర్. చౌదరి ద్వితీయ బహుమతులు... సీఐడీ ఎస్ఐ ఖాజా హఫీజున్నీసా బేగం, జోగులాంబ గద్వాల భరోసా కేంద్రం ఎస్ఐ బి. తారక తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఐజిపి గజరావు భూపాల్, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఒబిసి సమావేశం
## హైదరాబాద్‌లో నిర్వహించండి
### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌ను అభ్యర్థించిన మహేష్‌కుమార్



రాహుల్‌తో సమావేశమైన మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** జాతీయ ఒబిసి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించాలని మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి రిజర్వేషన్ అంశం కూడా పొందు పరిచేందుకు కృషి చేయాలని రాహుల్ గాంధీని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అభ్యర్థించారు. గురువారం ఢిల్లీలోని 10 జన్ పథ్ ఎఐసిసి అగ్రనేత, లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సమావేశమైనారు. దాదాపు 15 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ అంతర్గత అంశాలను, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాహుల్ గాంధీకి వివరించారు. తాజా రాజకీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న ఆర్గనైజేషన్ కార్యక్రమాలను కూడా గౌడ్ తెలిపారు. డిసిసి అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు, బిఎల్ఎ నియామకాలు, అనుబంధ సంఘాల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో రాహుల్ గాంధీకి తెలిపారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కుల ఘనన జరిపి కుల ఘనన సమగ్ర అధికారిక సమాచారాన్ని ప్రకటించినట్టు రాహుల్ గాంధీ వివరించారు. దేశంలో చేపడుతున్న మహిళ రిజర్వేషన్ల బిల్లులో బిసి రిజర్వేషన్ల అంశాన్ని కూడా జోడించాలని మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎఐసిసి జాతీయ ఒబిసి సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరిన మహేష్ కుమార్ కోరగా సానుకూలంగా రాహుల్‌గాంధీ స్పందించారు. అంతకు ముందు మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, రాజ్యసభ ఎంపి అనిల్ యాదవ్ కూడా రాహుల్‌గాంధీతో సమావేశం అయ్యారు.

## బ్యాంకు ఎటిఎంలో
## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**హైదరాబాద్ (కార్వాన్), ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూమల్లేపల్లి ప్రాంతంలో గల హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు ఎటిఎంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండటం స్థానికంగా కలకలం సృష్టించింది. స్థానికులు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు ఎటిఎంలో మృతదేహాన్ని గుర్తించగానే హుమాయూన్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ ఆదేశాల మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, భిక్షాటన చేస్తూ హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు ఎటిఎంలోకి ఆశ్రయం కోసం వచ్చి మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేసారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడా లేక ఎవరైనా హత్యచేసి పడవేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సమ్మెపై సిఎం రేవంత్‌రెడ్డి సీరియన్‌గా జోక్యం చేసుకోవాలి
### పార్టీలు, నాయకులు మ్యాచ్ ఫిక్సింగ్‌లతో
### రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారు: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రెండు రోజులుగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెలో ఒక కార్మికుడు నర్సంపేట డిపోలో ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా సమ్మె ఉధృతం అవుతున్న నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి సిరియస్‌గా తీసుకుని కార్మికులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మె మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా జన జీవనం స్తంభించిపోయిందని, ఒకవైపు విద్యార్థుల పరీక్షల సీజన్, మరొక వైపు పెళ్ళిళ్ల సీజన్ కొనసాగుతున్నదని, ఎంతో ప్రాముఖ్యతగల సమయంలో కార్మికులు సమ్మె చేస్తున్నందున సమస్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రైవేటు వాహనాలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఇప్పటికైనా సిఎం జోక్యం చేసుకుని పరిస్థితి విషమించకముందే చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు, నాయకులు మ్యాచ్ ఫిక్సింగ్‌లతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# వైస్‌ఛాన్సలర్లు కూడా క్లాసులు బోధించాలి

### యూనివర్సిటీల్లో పరిశోధనలు పెరగాలి
### ప్రభుత్వం, విద్యా శాఖతో సమన్వయం చేసుకోవాలి
### విసిల సమావేశంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సామర్థ్యం, పరిశోధన ఆధారిత వృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ఉప కులపతులు కూడా స్వయంగా క్లాసులను బోధించాలని సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల(వీసీ)తో గవర్నర్ గురువారం సమావేశమయ్యారు. లోక్‌భవన్‌లో వీసీలతో గవర్నర్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గవర్నర్ సెక్రటరీ దాన కిషోర్, ఉన్నత విద్యా విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు యూనివర్సిటీల వీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చాన్స్‌లర్ అయిన గవర్నర్ ఎస్‌పి శుక్లా మాట్లాడుతూ.. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యాభివృద్ధిలో చేస్తున్న కృషిని అభినందించారు. తరతరాల విద్యార్థుల రూపకల్పనలో వాటి చారిత్రక పాత్రను గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సుమారు 40 శాతం ఉండటం జాతీయ సగటుతో పోలిస్తే ఎక్కువగా ఉందన్నారు. యూనివర్సిటీలు కేవలం డిగ్రీలు అందించే కేంద్రాలుగా కాకుండా, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సామర్థ్యం, పరిశోధన ఆధారిత వృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపకులపతులు(వీసీ) స్వయంగా తరగతులు బోధిస్తూ విద్యా నాయకత్వానికి ఆదర్శంగా నిలవాలన్నారు. పండితుడిగా, గురువుగాను ప్రతిభ కనబర్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉదాహరణగా ప్రస్తావించారు. యూనివర్సిటీల వీసీలు ప్రభుత్వంతో విద్యాశాఖతో సమన్వయాన్ని బలోపేతం చేసుకొని నిధుల సమీకరణ, కోర్సుల రూపకల్పన చేసుకోవాలన్నారు. అలాగే స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి జాతీయ కార్యక్రమాల అమలులో చురుకైన భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, సేంద్రీయ విత్తనాల రంగాల్లో ప్రత్యేక పరిశోధనా కేంద్రాల స్థాపన ద్వారా పరిశోధన, ఆవిష్కరణలను బలోపేతం చేయాలని, గ్లోబల్ పోటీ సామర్థ్యం, ప్రతిభ వలస వంటి అంశాలపై దృష్టి పెట్టాలని గవర్నర్ వీసీలకు సూచించారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో ఉన్నత విద్యా మండలి ఇటీవల చేపట్టిన కార్యక్రమాలపై వివరించారు. గత సంవత్సరంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి అకాడమిక్ పునర్వ్యవస్థీకరణ, సంస్థాగత సామర్థ్యవృద్ధి, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారం వంటి కీలక రంగాల్లో మెరుగుదలకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉపకులపతులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు, అంతర్జాతీయ విద్యాసంస్థలతో నిరంతర అనుసంధానం ద్వారా విద్య-ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే సహకార వాతావరణం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి రూపొందించిన నివేదికను ఉపకులపతుల సమక్షంలో గవర్నర్ విడుదల చేశారు. సమావేశంలో ఉపకులపతులు ప్రొఫెసర్ కుమార్ మోలుగారం (ఉస్మానియా విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి (కాకతీయ విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ యాదగిరి రావు (తెలంగాణ విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ (మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ (పాలమూరు విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ (సాతవాహన విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ (వీరనారి చాకలి ఇల్లమ్మ మహిళా విశ్వవిద్యాలయం, ఇన్‌ఛార్జ్), ప్రొఫెసర్ నిత్యానందరావు (సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం), శ్రీ టి. కిషన్ కుమార్ రెడ్డి (జేఎన్‌టీయూ), ప్రొఫెసర్ టి. గంగాధర్ (జేఎన్ఏఎఫ్ఏయూ, ఇన్‌ఛార్జ్), ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి (డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ), ప్రొఫెసర్ అల్‌డాస్ జనయ్య (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం), డా. డి. రాజిరెడ్డి (శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ వి. జ్ఞానప్రకాశ్ (పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం), డా. కె. రమేష్ రెడ్డి (కాళోజి నారాయణరావు ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం) మరియు ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రొఫెసర్ గోవర్ధన్ (ఆర్‌జీయూకేటీ, బాసర) పాల్గొన్నారు.

## మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనాలి
### కేంద్ర ప్రభుత్వ నిబంధన ఎత్తివేయాలి
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రైతులు పండించిన మొక్కజొన్న, ధాన్యం పంటలను ఎలాంటి నిబంధనలు లేకుండా మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనాలనే కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధన ఎత్తివేసి, మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొక్కజొన్న పంట 11 లక్షల ఎకరాలు, వరి పంట 6070 ఎకరాలలో యాసంగి పంట వేసినట్లుగా వ్యవసాయ శాఖ పేర్కొన్నది. రైతులు ఎకరానికి 40 వేలకు పైగా పెట్టుబడి పెడితే సుమారు 45 50 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చిందని అంచనా. కేంద్ర ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనాలనే నిబంధన పెట్టడంతో పండిన మిగతా మొక్కజొన్నలను కొనకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.

మొక్కజొన్నకు మద్దతు ధర రు.2400 లభించడం లేదన్నారు. మధ్య దళారులు, మిల్లరు కుమ్మక్కై క్వింటా రూ1600 నుంచి రూ. 1800 మధ్య కొనుగోలు చేసి దోచుకుంటున్నారన్నారు. అధిక పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో జరగడం లేదన్నారు. మద్దతు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అకాల వర్షాలు కురిశాయని దాంతో మక్కలు, ధాన్యం తడిశాయని, తేమ ఉందనే పేరుతో పలు నిబంధనలు పెట్టి ధరను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలుకు అవసరమైన గోనె సంచుల కొరత, రవాణాకు లారీలు అందుబాటులో లేకపోవడం వల్ల ఖమ్మం, నల్లగొండ, వరంగల్, నిర్మల్ తదితర జిల్లాల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం మొక్కజొన్న, ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో కుల అంతరాలను తగ్గించని పట్టణీకరణ
### స్వతంత్ర నిపుణుల కార్యవర్గం వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** తెలంగాణలో పట్టణీకరణ కుల అంతరాలను తగ్గించలేదని స్వతంత్ర నిపుణుల కార్యవర్గం (ఐఈడబ్ల్యూజి) వెల్లడించింది. ఎస్ఇఇపిసి సర్వే నుండి సేకరించిన డేటాను విశ్లేషించిన స్వతంత్ర నిపుణుల కార్యవర్గం ఒక నివేదికను రూపొందించింది. ఈ మేరకు దీనికి సంబంధించి స్వతంత్ర నిపుణుల కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ చక్రవర్తి, కంచ ఐలయ్య ఈ పరిశోధనల ఫలితాలను సమర్పించారు. దీని ప్రకారం ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉన్న కులాలు అది లేని వారికంటే మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ పేద పిల్లలలో 5 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుండగా, ఓసీ పేద పిల్లలలో 34 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల వల్ల ఎస్సీ, ఎస్టీ వర్గాలు, చేయూత పెన్షన్, గృహజ్యోతి పథకాల వల్ల బీసీ వర్గాలు ప్రయోజనం పొందుతాయని వివరించారు.

## డంపింగ్ యార్డు రద్దు కోసం ఊరంతా కదిలింది..
### నాలుగు గ్రామాల మీదుగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాదయాత్ర



డంపింగ్ యార్డు రద్దు కోసం పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

**జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:** అనాడు ఉమ్మడి రాష్ట్ర పాలనలో అతలా కుతలమై.. అన్నింటిలో వెనుకబాటుకు గురైన తెలంగాణ ప్రాంతం 2001నుండి 2014వరకు తెగించి సబ్బండ వర్గాల ప్రజల సారథ్యంలో ఊరు, వాడ, పల్లె, పట్నం అంత ఒక్కతాటిపైకి వచ్చి ఉవ్వెత్తిన లేచిన ఆ ఉద్యమానికి పాలక ప్రభుత్వాలు తలొగ్గి తెలంగాణ ప్రజల చేతిలో ప్రత్యేక రాష్ట్రాన్ని చేతిలో పెట్టింది. ఆ 14 సంవత్సరాల ఉద్యమస్ఫూర్తిని పునికిపుచ్చుకున్న హుజూరాబాద్ గడ్డ మీది ప్రజల ప్రాణాలకు డంపింగ్ యార్డు ముప్పు పొంచి ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని 40రోజులుగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై ఉవ్వెత్తిన లేచిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం చివరకు గ్రామాలకు పాకింది. అందులో భాగంగానే హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగా హుజూరాబాద్ బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన సతీమణి శాలిని రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు గందె రాధికశ్రీనివాస్, తక్కల్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కల్లపల్లి సత్యనారాయణరావు, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, వర్దినేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో హుజురాబాద్, పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లి, సిర్సపల్లి, గణేష్‌నగర్, సిర్సపల్లి క్రాస్‌రోడ్ మీదుగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పలు గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు రద్దుకై సాయంత్రం వరకు పాదయాత్ర కొనసాగించారు.

## సంక్షేమ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు టెండర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురుకులాల్లో దాదాపు 19 లక్షల మంది విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు, ఇతర సామగ్రిని సమకూర్చేందుకు సెంట్రలైజ్డ్ ప్రక్రియ ద్వారా టెండర్లను అహ్వానించింది. వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ సంక్షేమ గురుకులాల్లో 24 రకాల వస్తువుల సరఫరా కోసం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ (టీజీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్) ఇటీవలే టెండర్లు ప్రక్రియను నిర్వహించింది. ఈ టెండర్లలో యూనిఫాంలు, స్కూల్ బ్యాగులు, బెడ్డింగ్ మెటీరియల్, స్టేషనరీ కిట్లు, పేట్ల వంటి వస్తువులను 9 కేటగిరీల వారీగా విభజించి దరఖాస్తులు కోరారు. ఇందుకు గాను 27 మంది కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి బిడ్లు దాఖలు చేశారు. అయితే గతంలో కంటే టెండర్ల నిబంధనలు కఠినతరం చేయడంతో పక్కాగా ఉంటుందని సంఘిక సంక్షేమ శాఖ భావిస్తోంది. ముఖ్యంగా టర్నోవర్ పరిమితిని భారీగా పెంచడం, నోట్ పుస్తకాల తయారీలో వాటర్ మార్క్ పేపర్ వాడాలనే నింబధనలు విధించడంతో కాంట్రాక్టర్లకు చెక్ పెట్టినట్లయింది. దరఖాస్తు గడువును ఈనెల 13 నుంచి 17 వరకు పెంచడంతో మరో నాలుగైదు రోజుల్లో ఫైనాన్షియల్ బిడ్లను ఓపెన్ చేసే అవకాశం ఉందని అధికవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వీటికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.


## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని
## 28న సిఎం ఇంటికి పాదయాత్ర
### హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం మౌనం సరికాదు
### పోస్టర్‌ను విడుదల చేసిన ఎఐఎస్ఎఫ్

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం ఇంటికి పాదయాత్ర చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర అనే కార్యక్రమ గోడ పత్రికను, హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిరక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఫీజు బకాయి విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు కాలేజీ ఫీజులు చెల్లించి, పరీక్ష ఫీజులు కట్టి హాల్‌టికెట్స్, సర్టిఫికెట్లు తీసుకోవాలని వేధిస్తున్నాయన్నారు. కొద్దిరోజుల క్రితం ఫీజురీయింబర్స్‌మెంట్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థుల వద్ద నుండి ఫీజులు వసూలు చేసుకోమని.. వచ్చిన తర్వాత విద్యార్థులకు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదన్నారు. ఈ తీర్పుపై ప్రభుత్వం ఇప్పటికి స్పందించకుండా మౌనంగా ఉండడం వల్ల ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. హైకోర్టు తీర్పును పునసమీక్షించి ఆలోచించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి విద్యార్థి తాము నిర్వహించే ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్రకు తరలి రావాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి అన్వర్, చైతన్య యాదవ్, అనిల్, నాయకులు నెల్లి సత్య, కృష్ణ పాల్గొన్నారు.

## సింగరేణి సిఆర్టీలకు వేసవిలో వేతనాలు చెల్లించాలి
### సింగరేణి సిఎండికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** సింగరేణి సీఆర్టీలకు వేసవిలో వేతనాలు చెల్లించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లకు పన్నెండు నెలల వేతనాలు అందించాలని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కోరారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సీఆర్టీలు కేవలం పది నెలల వేతనాలు మాత్రమే పొందుతూ ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారి సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ తెలిపారు. స్పందించిన సింగరేణి సీఎండీ వెంటనే వారిని తిరిగి విధులలో చేరే విధంగా ఉత్తర్వులు ఇస్తామని సీఎండీ తెలిపారని ఎమ్మెల్సీ తెలిపారు. వారికి కనీస వేతనం చెల్లింపుపై కూడా హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. సింగరేణి ఆసుపత్రులతోపాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రులలో వారికి ఉచిత వైద్యం అందించాలని కోరినట్టు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో పీఆర్‌టీయు ఆడిట్ కమిటీ చైర్మన్ సోమి రెడ్డి శ్రీనివాస రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపు జైపాల్‌రెడ్డి. చిత్రంలో అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు

## ఓసి హక్కుల సాధన కోసం నగరంలో
## భారీ బహిరంగ సభ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఒసిల హక్కుల సాధన కోసం ఆగస్టు మాసంలో హైదరాబాద్ నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఒసి జెఎసి ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం హిమాయత్‌నగర్‌లోని ఓసి జెఎసి కార్యాయలంలో జరిగిన మీడియా సమావేశంలో జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఓసి సామాజిక వర్గాల పక్షాన ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయని కారణంగా కులం పేరు చెప్పుకోలేని స్థితిలో వేలాది ఓసి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసి సామాజిక వర్గం రాష్ట్రంలో 21 శాతం ఉందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో ఆరు లక్షల మంది తమ వివరాలను నమోదు చేసుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తమిళనాడులో రిజర్వేషన్‌లు అమలు చేయకపోవడం, మహారాష్ట్రలో ఉద్యోగాలలో వయోపరిమితి పెంచకపోవడం అన్యాయమన్నారు. జెఎసి జాతీయ ఛైర్మన్ నాళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ఓసి నిరుపేదల సమస్యలపై మే 17న 33 జిల్లాల జెఎసి ముఖ్య నాయకులతో హైదరాబాద్ నగరంలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

## మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలుచేసిన కెసిఆర్
### జీవన్‌రెడ్డిని రీచార్జ్ చేయడానికి బయటకు వచ్చిన కెసిఆర్
### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** మిగులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన రాటు దేలిన దోపిడీదారులు కెసిఆర్ కుటుంబమనీ భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తీర్పు ఇస్తే ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారనీ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మీరు చేసిన అవినీతిలో తెలంగాణ రైతులకు ఏం సంబంధమనీ అడిగారు. హైకోర్టు తీర్పుతో బావ, బామ్మర్దులు ఇద్దరు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించారనీ విమర్శించారు.

కాళేశ్వరంలో క్లిన్ చిట్ వచ్చినట్లు హరీశ్‌రావు, కెటిఆర్ మాట్లాడుతున్నారనీ అన్నారు. రెండు పిల్లర్లు కూలితే ఏమవుతుందని అంటున్నారనీ ఆయన ఎద్దేవా చేశారు. కాళేశ్వ రానికి మేడిగడ్డ బ్యారేజ్ గుండె కాయ అని కెసిఆర్ చెప్పారనీ, మేడిగడ్డలో నీళ్లు నింపవద్దని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పిందనీ ఆయన వివరించారు. తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో వాస్తవాలు తెలుసుకుని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారనీ ఆయన అన్నారు. బావా, బామ్మర్దులు తీన్మార్ డ్యాన్స్‌లు వేస్తున్నారనీ ఆరోపించారు. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులను ఎందుకు బిఆర్ఎస్ హయాం లో పూర్తి చేయలేదనీ ఆయన అన్నారు. ప్రత్యేకరాష్ట్రం కోసం 1600 మంది బలిదానాలు నీళ్లు, నిధులు, నియామకాలు చేశారని కెసిఆర్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికి కాదని అన్నారు. కెసిఆర్ సంవత్సరం తర్వాత బయటకు వచ్చారనీ ఇది కేవలం జీవన్‌రెడ్డిని రీ ఛార్జ్ చేయడానికి వచ్చారనీ అన్నారు. కాళేశ్వరం పేరుతో కార్పోరేషన్ ఏర్పాటు చేసి అప్పులు చేశారు కెసిఆర్ గూగుల్ మ్యాపులు చూసి ప్రాజెక్టులు కట్టారనీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన నాగార్జున సాగర్ ఎందుకు కుంగలేదనీ ఆయన ప్రశ్నించారు. సిబిఐ విచారణ ఆపమని హైకోర్టు తీర్పు ఇవ్వలేదనీ అన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ విచారణ జరిపించాలని, పదేళ్లలో బిఆర్ఎస్ దోపిడీని కేంద్రంలో పాలనలో ఉండే ఆపార్టీ నేతలు ఎందుకు ఆపలేదని దుయ్యబట్టారు. బిజెపి డ్రామాలు ఆడుతోందనీ అన్నారు. అందుకే తెలంగాణ ప్రజలు బిజెపిని నమ్మకుండా రేవంత్ రెడ్డిని సిఎంను చేశారనీ అన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ కు గుండు సున్నా వచ్చిందనీ అన్నారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ నేతలను విడిచిపెట్టేది లేదుప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చలు చేస్తోందిఅన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సంబురాల రాంబాబులను లోపల వేస్తామనీ హెచ్చరించారు.

## రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వాసవీ జయంతి కార్యక్రమాన్ని అధికారిక రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చుతూ జిఓ ఇచ్చినందుకు గురువారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆర్యవైశ్యులు కృతజ్ఞతను ప్రదర్శించుకొన్నారు. ఆర్య వైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. గాంధీ భవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు చిత్రపటాలకు సుజాతతోపాటు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌హైదరాబాద్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూనకిట్టు, సరబ్ లక్ష్మన్,సంతోష్,ఆకుల రమాకాంత్ కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి పాలకమండలి సభ్యులు నరేష్‌గుప్త, కవితా గుప్తా వైశ్యప్రతినిధులు కుపాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు కల్వ సుజాత తెలిపారు.

## రసాయన ఫ్యాక్టరీలో భారీ పేలుడు

### పలువురు కార్మికులకు తీవ్రగాయాలు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 23:** గుజరాత్‌లోని ఒక కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో అనేకమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని భరూచ్ జిల్లా, ఝగాడియా ప్రాంతంలోని జీఐడీసీ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మెట్రోపాలిటన్ ఎక్సిమ్‌కెమ్ అనే పరిశ్రమ ఔట్‌లెట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ ఇతర పరిశ్రమలకు అవసరమయ్యే రసాయనాల్ని భారీగా తయారు చేస్తారు. దేశంలోని కీలక రసాయన పరిశ్రమల్లో ఇదీ ఒకటి. ఈ పరిశ్రమ పరిధిలో ఒక పేలుడు జరిగింది. దీని కారణంగా మంటలు భారీ స్థాయిలో వ్యాపించాయి. ఈ ఘటనలో అనేకమంది కార్మికులు గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఇక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.




## క్రెడిట్‌కార్డు నిలిపివేయనందుకు

## కస్టమర్‌కు బ్యాంకు రూ.3.21 లక్షల పరిహారం

**ముంబయి, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన కోటక్ మహీంద్రా బ్యాంక్ నుంచి ఓ క్రెడిట్ కార్డు వినియోగదారుడు ఏకంగా రూ.3.21 లక్షల పరిహారం పొందారు. తాను పంపిన అభ్యర్థనలను సకాలంలో ప్రాసెస్ చేయకుండా, కార్డును క్లోజ్ చేయడంలో బ్యాంకు తీవ్ర నిర్లక్ష్యం వహించడమే ఇందుకు కారణం. ఓ వినియోగదారుడు తన వద్ద ఉన్న రెండు కోటక్ మహీంద్రా క్రెడిట్ కార్డులను క్లోజ్ చేయాలని 2025 మే నెలలో ఈమెయిల్ ద్వారా బ్యాంకును కోరారు. రూ.1 లక్షగా ఉన్న తన క్రెడిట్ లిమిట్‌ను బ్యాంకు అకస్మాత్తుగా రూ.10,000కు తగ్గించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమెయిల్‌కు స్పందన రాకపోవడంతో మరో రెండుసార్లు రిమైండర్లు పంపినా ప్రయోజనం లేకపోయింది. దాదాపు ఏడాది తర్వాత 2026 ఏప్రిల్‌లో తన ఖాతాలను పరిశీలిస్తున్నప్పుడు, వార్షిక రుసుము కింద రూ.1,180 ఛార్జ్ చేసినట్లు గుర్తించారు. దీనిపై బ్యాంకును ప్రశ్నించగా, కార్డులు రద్దు కాలేదని సమాధానం వచ్చింది. బ్యాంకు వైఖరితో విసిగిపోయిన ఆ వినియోగదారుడు, నేరుగా బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బ్యాంకు నోడల్ అధికారి రంగంలోకి దిగి, ఈమెయిల్ ద్వారా కార్డు క్లోజర్ అభ్యర్థనలు స్వీకరించబడవు, మీరు కాల్ చేయాల్సింది అంటూ మొదట కస్టమర్ తప్పేనని వాదించారు. తాను రాతపూర్వక అభ్యర్థన ఇచ్చానని, దానికి ఆధారాలున్నాయని బాధితుడు స్పష్టం చేశారు. అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు బ్యాంకుకు ప్రతికూలంగా మారింది. కొన్ని రోజుల తర్వాత పరిహారంగా తన బ్యాంకు ఖాతాలో రూ.3,21,000 జమ అయినట్లు వినియోగదారుడు రెడిట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల ప్రకారం కార్డు మూసివేతలో జాప్యం జరిగితే రోజుకు రూ.500 చొప్పున పరిహారం చెల్లించాలి. తన విషయంలో రెండు కార్డులు కావడంతో రోజుకు రూ.1,000 చొప్పున 321 రోజుల జాప్యానికి గాను రూ.3,21,000 పరిహారం లభించిందని ఆయన వివరించారు.

## కైలాశ్ హిల్స్ హత్యాచారం కేసులో వెలుగులోకి కొత్తకోణం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** దేశ రాజధాని ఢిల్లీలోని కైలాష్ హిల్స్‌లో యువతి హత్యాచారం కేసులో పోలీసులు సంచలన విషయాలను వెల్లడించారు. ఢిల్లీలో హత్యాచారానికి ముందే మరో మహిళపై నిందితుడు రాహుల్ మీనా లైంగిక దాడికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఓ మహిళపై అతను అత్యాచారం చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని బుధవారం రాత్రి అరెస్టు చేశామని, కేసు దర్యాప్తు మరింత లోతుగా కొనసాగుతోందని వెల్లడించారు. ఢిల్లీ అత్యాచార ఘటనకు ముందు మంగళవారం రాత్రి అల్వార్‌లోని తన స్నేహితుడి ఇంటికి రాహుల్ వెళ్లాడని పోలీసులు తెలిపారు. స్నేహితుడు లేకపోవడంతో అతని భార్యపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పారు. అదే రోజు రాత్రి ఆ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం అనంతరం నిందితుడు వెంటనే అల్వార్ నుంచి ఢిల్లీకి బయలుదేరాడని వెల్లడించారు. ప్రయాణ ఖర్చుల కోసం మొబైల్ ఫోన్‌ను రూ.10వేలకు విక్రయించాడని, తనను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు రూ.6,000 చెల్లిస్తానని వ్యాన్ డ్రైవర్‌కు చెప్పినట్లు తెలిపారు. దేశ రాజధానికి చేరుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే అక్కడి నుంచి తప్పించుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. బుధవారం ఉదయం సుమారు 6:30 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని కైలాష్ హిల్స్‌కు నిందితుడు రాహుల్ చేరుకున్నాడని పోలీసులు తెలిపారు. అనంతరం 6:39 గంటలకు బాధితురాలి ఇంట్లోకి ప్రవేశించాడని, సుమారు 40 నిమిషాల పాటు ఇంట్లోనే ఉన్నాడని, ఆ సమయంలో యువతిపై అత్యాచారం చేశాడని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె గొంతు నులిమి హత్య చేశాడని నగదు, విలువైన వస్తువులు దోచుకుని పారిపోయినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

# ఎక్కడి బస్సులు అక్కడే

> కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె
>
> బస్సులను అడ్డుకున్న పలువురు నాయకుల అరెస్టు
>
> నేడు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కతో
>
> జెఏసి నేతల చర్చలు!

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండో రోజు ఆర్‌టీసీ కార్మికులు సమ్మె కొనసాగించడంతో బస్సులు డిపోలకే పరిమితమ య్యాయి. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు. బస్సులను డిపోల నుంచి బయటికి రానివ్వకుండా అడ్డుకున్నారు. కార్మికుల ఆందోళనల్లో భాగంగా నర్సంపేట, మిర్యాలగూడెంలో ఇద్దరు డ్రైవర్లు పెట్రోల్, డీజిల్ వంటిపై పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. బస్సులను డిపోల నుంచి బయటికి రానివ్వకుండా అడ్డుకున్న ఆర్‌టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్నతోపాటు మరికొందరు జేఏసీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్‌టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజు కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టీసీ డీపోల ముందు కార్మికులు ధర్నాలు చేపట్టారు. ఉదయం నుంచే కార్మికులు డిపోల ఎదుట బైఠాయించి తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆందోళనలు చేస్తున్న కార్మికులను పలు జిల్లాల్లో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో కార్మికులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్నతో పాటు పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. డిపోల నుంచి బస్సులు బయటకు కదలకుండా కార్మికులు అడ్డుకున్నారు. రెండో రోజు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీతోపాటు ఇంజనీరింగ్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరు కావడానికి ఆర్‌టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పరీక్షలకు హాజరయ్యారు. జనగామ ఆర్‌టీసీ డీపో దగ్గర కార్మికుల ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతి లేదంటూ టెంట్లు తొలగించారు. దీంతో పోలీసుల తీరుపై ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు ఆలోచన చేస్తే..తాము ఆందోళన పంథాను మారుస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అర్ధరాత్రి పిలిచినా చర్చలకు వెళ్లేందుకు జేఏసీగా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం చేసిన అలసత్వంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు.

**ఇద్దరు డ్రైవర్ల ఆత్మహత్య యత్నం ..**

నర్సంపేట పట్టణంలోని ఆర్‌టీసీ డిపోలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.ఆందోళన చేస్తున్న క్రమంలో బోలా శంకర్ అనే డ్రైవర్ పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. ఈ ప్రమాదంలో శంకర్‌కు దాదాపు 90శాతం గాయాలయ్యాయి. తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని శంకర్ ఈ ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు కార్మికులు చెబుతున్నారు. డ్రైవర్ ఆత్మహత్య యత్నంతో కార్మికులు ఆందోళన తీవ్రతరం చేశారు. డిపో మేనేజర్ డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన డ్రైవర్ శంకర్‌ను హుటాహుటిన నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది.

**మిర్యాలగూడలో ఒంటిపై డీజిల్ పోసుకొని డ్రైవర్ ఆత్మహత్యయత్నం**

నల్గొండ జిల్లా మిర్యాలగూడలో మరో డ్రైవర్ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్యహత్యకు యత్నించాడు. మిర్యాలగూడ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న వెంకన్న గురువారం నల్గొండ డిపో వద్ద ఆర్‌టీసీ సమ్మెలో పాల్గొన్నాడు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేరు స్తుందో లేదో అనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఆత్మహత్యకు ప్రయత్నించిన వెంకన్నను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

**ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలిః ఆర్టీసీ జెఎసి**

నర్సంపేట డిపో డ్రైవర్ ఆత్మహత్యా ప్రయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆర్‌టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన 3 ప్రధాన డిమాండ్లను పక్కకు పెట్టి మిగిలిన 29 డిమాండ్లను పరిష్కరించామని రవాణా మంత్రి చెప్పిన అబద్ధపు మాటల వలన కలత చెంది, మనోవేదనకు గురై, ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగే సమస్యలను పరిష్కరించడానికి మొండి వైఖరి అవలంబిస్తున్నందుకు తట్టుకోలేక క్షణికావేశంతో నర్సంపేట డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా 70 శాతం కాలిన గాయాలతో వరంగల్ లోని ఎం.జి.ఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ దుర్ఘటన పట్ల జెఏసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 34 మంది ఆర్‌టీసీ కార్మికులు ఆత్మబలిదానం చేసుకుంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమంది కార్మికులు బలిదానాలు చేసుకుంటే దిగివస్తుందో చెప్పాలన్నారు. ఇప్పటివరకు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న ఆర్‌టీసీ కార్మిక వర్గంపై ఉక్కుపాదం మోపుతూ, డిపోలలో వేసుకున్న టెంట్లను పోలీసులతో కూల్చివేయించి అక్కడినుండి నిర్దాక్షిణ్యంగా కార్మికులను తరిమి కొడుతున్నారని, ఇదేనా ప్రజాపాలన అని ముఖ్యమంత్రిని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మోలానా, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, కత్తుల యాదయ్య, బి.యాదగిరి ప్రశ్నించారు. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ కు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా, వెంటనే మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఆత్మహత్య సంఘటనలకు ఆర్‌టీసీ యాజమాన్యం, ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి స్పందించి సమ్మె డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపచేయాలన్నారు. అన్ని డిపోలలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించి కార్మికులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికవర్గమంతా క్షణికావేశానికి లోను కాకుండా, ఎలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, ఐకమత్యంతో మనమంతా కొట్లాడి మన డిమాండ్లను సాధించుకోవడానికి జేఏసీ కృత నిశ్చయంతో ఉందని, మీరంతా జేఏసీ పట్ల విశ్వాసంతో ఉండాలని కోరుతున్నామన్నారు. నేటి నుంచి చేపట్టబోయే కార్యక్రమాలను జేఏసీ నేతలు ప్రకటించారు. నేడు(24న) అన్ని డిపోల ముందు మౌన ప్రదర్శనలు చేపట్టాలని, రేపు(25 ఏప్రిల్‌న) అన్ని డిపోల దగనగర వంటావార్పు చేపట్టాలని, ఈ నెల 26న అన్ని రీజియన్‌లలో, జిల్లాలలో కార్మిక కవాత్ నిర్వహించాలని, ఈ నెల 27న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రులకు, వినతిపత్రాలు సమర్పించాలని, ఈ నెల 28న మహిళ ఉద్యోగులతో అన్ని డిపోలలో బతుకమ్మలతో నిరసన ప్రదర్శనలు, ఈ నెల 29న అన్ని డిపోల ముందు అర్ధనగ్న ప్రదర్శనలు చేయాలని నిర్ణయించినట్టు జేఏసీ నేతలు తెలిపారు.

## ఎల్బీనగర్-హాయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌తో ట్రాఫిక్ కష్టాలకు ఉపశమనం

### టెండర్లు పిలిచేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి

### వచ్చేవారం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలుస్తా

### ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** ఎల్బీనగర్ హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ తో ట్రాఫిక్ కష్టాలకు ఉపశమనం లభించడంతోపాటు ప్రమాదరహితంగా రహదారి మారుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో



ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,హెచ్ ఎం ఆర్ ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి జాతీయ రహదారి సి ఇ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు.సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు.ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు.జాతీయ రహదారి 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు.దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని మోర్త అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు మోర్త్ వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని ఆర్ ఒ కృష్ణ ప్రసాద్ తెలిపారు.కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా హెచ్ ఎం ఆర్ ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు.అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

## అమెరికా మాటలు మేం నమ్మం

>> మోహరించింది. ఇంకోవైపు, ఇరాన్ హార్మూజ్ జలసంధిని మూసివేస్తోంది. చర్చల ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ, దాడులు, దిగ్బంధాలు కొనసాగుతుండటంతో కొలిక్కి రావడం లేదు. కాల్పుల విరమణ అంటూనే మరోపక్క అమెరికా ఇరాన్‌లోని నౌకాశ్రయాలను దిగ్బంధంచేయడాన్ని కాల్పుల విరమణ కార్యాచరణను ఉల్లంఘించడం కాదా అని ఇరాన్ అధ్యక్షుడు ప్రశ్నించారు. అమెరికా వైఖరి తమకు నమ్మశక్యంగాలేదని అందుకే తాము హార్మజ్‌ను మూసివేసి ఉంచినట్లు ఆయన తెలిపారు.

**14నౌకలు వచ్చాయ్.. ఇంకా 14 పర్షియన్ గల్ఫ్‌లోనే**

హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలున్నా ఇప్పటివరకూ 14 భారత నౌకలు ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటపడ్డాయని, మరో 14 నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం తెలిపారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో, ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు జరిగే హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించిన కొన్ని గంటల్లోనే, భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న ఎపామినోడాస్‌ఖి అనే నౌకపై ఇరాన్ దాడి చేసింది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌకతో పాటు మరో షిప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతకుముందు గత శనివారం కూడా, అనుమతి పొందిన రెండు భారత నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలీని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పిలిపించి మాట్లాడారు. భారత నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కాల్పులు జరపడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకల భద్రతకు భారత్ ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గతంలో భారత్‌కు వచ్చే నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నౌకల రాకపోకలను తిరిగి సులభతరం చేయాలని కోరినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

**సీమైన్స్ తొలగించేందుకు ఆరునెలలుపైగానే!**

హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ సీమైన్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ సీమైన్లను తొలగించేందుకు సుమారు ఆరునెలల సమయం పడుతుందని అమెరికా చట్టసభ ప్రతినిధులకు పెంటగాన్ తెలిపింది. హౌస్ ఆర్మ్డ్ సర్వీసెస్ కమిటీతో జరిగిన క్లాసిఫైడ్ బ్రీఫింగ్ సమయంలో రక్షణశాఖ ఈ విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో ఎంత ఖర్చు అయ్యిందన్న అంశాన్ని చట్టసభ ప్రతినిధులు ప్రశ్నించినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ఫిబ్రవరి 28వ తేదీన టెహ్రాన్‌పై దాడి జరిగిన సమయంలో ఓ స్కూల్‌పై కూడా బాంబు పడిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో మినాబ్ పాఠశాలకు చెందిన సుమారు 168 మంది చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన పట్ల కూడా చట్టసభ ప్రతినిధులు పెంటగాన్ బ్రీఫింగ్‌లో ప్రశ్నలు కురిపించినా అందుకు సరైన సమాధానాలు దొరకలేదు.

## కస్టమర్ల భద్రతకు బ్యాంకులు పెద్దపీట వేయాలి

### ఆర్‌బిఐ గవర్నర్‌కు నగర కమిషనర్ సజ్జనార్ లేఖ

**హైదరాబాద్,ఏప్రిల్23,ప్రభాతవార్త:** బ్యాంకు వినియోగదారుల భద్రతకు పెద్దపీటవేయడంతో పాటు సైబర్ నేరగాళ్ళకు బ్యాంకు అధికారుల నుంచి అందుతున్న సహకారం,మ్యూల్ ఖాతాల కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు సజ్జనార్ లేఖ రాశారు. దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలకు కారణం బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలేనని హైదరాబాద్ పోలీస్ కమీషరన్ సజ్జనార్ ఆరోపించారు. సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని అన్నారు. వందల కేసుల్లో సైబర్ నేరస్థులకు బ్యాంకు అధికారులే సహకరిస్తున్నట్లు తేలిందన్నారు. గురువారం నగరంలోని అనేక బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సజ్జనార్ మాట్లాడుతూ బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా.. పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలనీ సూచించారు. దీనికోసం ట్విన్ ఛాలెంజ్ విధానాన్ని ప్రవేశపెట్టాలనీ కోరారు.. జీరో సైబర్ క్రైమ్ బాధితులు, జీరో మ్యూల్ అకౌంట్లుఅనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలనీ ఆయన హితవుచెప్పారు.. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కెవైసి వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలి అని అన్నారు. నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కస్టమర్ల భద్రతకు బ్యాంకు అధికారులు పెద్దపీట వేయాలని సజ్జనార్ కోరారు. కస్టమర్లు సైబర్ నేరాల బారిన పడకుండా చూడాలన్నారు. బ్యాంకులు జీరో మ్యూల్ అకౌంట్స్ లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా వాసవీమాత జయంతి.. ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్23:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ యేడాది ఏప్రిల్ 26న వాసవీ జయంతి రానుండటంతో, ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది.

## మౌలాలిలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

### రూ. 17 కోట్ల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం

### మూతపడ్డ పారిశ్రామిక కంపెనీలో గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ తయారీ

**హైదరాబాద్ (మల్కాజిగిరి), ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ప్రభుత్వం డ్రగ్స్‌పై ఎన్ని కఠినచర్యలు తీసుకుంటున్నప్పటికీ పోలీస్ అధికారులు ఈగల్ టీం అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు మోపుతున్నప్పటికీ, డ్రగ్స్ ముఠా అరాచకాలు పెరిగిపోతూనే ఉన్నాయి. నగరంలో మాదక ద్రవ్యాల కట్టెలపై నార్కోటెక్స్ అధికారులు ఎన్‌సిబి అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి మౌలాలి పారిశ్రామికవాడలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్ తయారీ కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో 17 కోట్ల రూపాయల విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మూతపడ్డ పారిశ్రామిక యూనిట్లో ఒక షెడ్డును కిరాయికి తీసుకొని డ్రగ్స్ సరఫరా చేసే మూట ఇక్కడ ప్రమాదకరమైన డ్రగ్స్‌ను అక్రమంగా తయారుచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అధికారుల సోదాల్లో డ్రగ్స్ కు సంబంధించిన 69,000 కిలోల ఆల్ఫో జోలం స్వాధీనం చేసు కున్నారు. ఎఫెడ్రిన మత్తు పదార్థాలను అరికాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో రెండు ప్లాస్టిక్ డ్రమ్ములలో భారీగా డ్రగ్ మెటీరియల్ ఉన్నట్లు పోలీస్ అధికారులు గుర్తించారు. డ్రగ్స్ తయారీ కేంద్రంలో ఒక కెమిస్ట్‌తో పాటు, ముడిసరుకు పంపిణీ చేసే వ్యక్తి, సరఫరా చేసే వ్యక్తులు, తరలించే వ్యక్తిని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సమాచారం. ముగ్గురు నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు చేతులు కలిపిన కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంలు



**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన పై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో చేతులు కలిపాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అసదుద్దీన్ ఒవైసీ కళ్లలో ఆనందం చూడటం కోసమే రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి ఈ బిల్లును అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. మొదటి నుంచీ మహిళలకు రిజర్వేషన్లు ఉండకూడదనేది మజ్లిస్ కుట్ర అని ఆయన విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్నందుకు నిరసనగా గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి అధ్యక్షతన జరిగిన “మహిళ ఆగ్రహ యాత్ర“ లో జి.కిషన్ రెడ్డి దేశంలో 70 కోట్ల మహిళా లోకానికి తీరని అన్యాయం చేసారని, వారిని ఓడించారని దుయ్యబట్టారు. రాజకీయంగా పైకి రాకపోవడానికి ఈ బిల్లును అడ్డుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గాల పునర్విభన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిదమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు.50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ అనేకసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లులో ద్వంద్వ వైఖరి అవలంబించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇప్పటి వరకు 7 సార్లు బిల్లు పాస్ కాకుండా అడ్డుకుందని కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇటీవల మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ,ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీలను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య విద్వేషాలు సృష్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కుట్రలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, వీరు జాక్ సోరస్ వంటి శక్తులకు, విదేశీ మిషనరీలకు ఆటబొమ్మలుగా మారారని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ భారత్

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### మహిళా బిల్లు ద్రోహి రేవంత్‌రెడ్డి: కేంద్రమంత్రి బండి సంజయ్

మధ్య విద్వేషాలు సృష్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కుట్రలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు మండిపడ్డారు. వీరు జాక్ సోరస్ వంటి శక్తులకు, విదేశీ మిషనరీలకు ఆటబొమ్మలుగా మారారని తీవ్రంగా విమర్శించారు. రామాయణం గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని, ఆయన ఎప్పుడో రేవంతుద్దీన్ గా మారిపోయారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని మోదీ స్పష్టం చేసినా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీని మహిళా వ్యతిరేక పార్టీగా ఆయన అభివర్ణించారు. కేసీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తన మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించలేదని గుర్తు చేస్తూ దుయ్యబట్టారు.




## కోహ్లీ వర్సెస్ గిల్ పోరుకు చిన్నస్వామి రెడీ

# ఆర్సీబీ మాస్ మసాలా

**బెంగళూర్:** బెంగళూర్ చిన్నస్వామి స్టేడియం వేదికగా నేడు ఐపీఎల్‌లో మరో ఆసక్తికర పోరు జరగనుంది. హోంగ్రౌండ్ అనుకూలంగా ఆర్సీబీ ... గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఇరు జట్లు కూడా గత మ్యాచ్‌లో ఓడి బెంగళూరుకు వచ్చాయి. ఆర్సీకిపై ఢిల్లీ క్యాపిటల్స్ నెగ్గగా.... ముంబై చేతిలో జీటీకి భారీ ఓటమి ఎదురైంది. ఇరు జట్లలోనూ టాప్ ప్లేయర్లు ఉండడంతో మ్యాచ్ ఫలితంపై ఆసక్తి నెలకొంది.

ఆర్సీబీకి ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, పడిక్కల్, టిమ్ డేవిడ్, భువనేశ్వర్ కుమార్, హేజిల్ వుడ్ లాంటి బ్యాటింగ్, బౌలింగ్ దిగ్గజాలు ఉన్నారు. అయితే గత మ్యాచ్‌లో అనూహ్యంగా ఓడింది. ఢిల్లీతో మ్యాచ్‌లో భువనేశ్వర్ బెంబేలెత్తిస్తూ మూడు వికెట్లతో టాప్ ఆర్డర్‌ను కూల్చినా మిగతా బౌలర్ల నుండి సరైన తోడ్పాటు లేకపోవడంతో ఓటమి పొందింది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో బౌన్స్ బ్యాక్ చేయాలని ఉవ్విళూరుతోంది. విరాట్ కోహ్లీ చక్కగా పరుగుల వేటలో ఉండగా, మిగతా వారు కూడా రాణిస్తే ఆర్సీబీకి తిరుగుండదు. హేజిల్‌వుడ్ రాకతో ఆర్సీబీ బౌలింగ్ మరింత పటిష్టమైంది.

ఇటు శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్‌ను కూడా తక్కువ అంచనా వేయలేం. వరుస 3 విజయాలతో జోష్ మీదికొచ్చింది. అయితే బ్యాటింగ్ వైఫల్యంతో గత మ్యాచ్‌లో ఓడింది. సాయి సుదర్శన్, గిల్ చక్కని శుభారంభం అందిస్తే.. జాస్ బట్లర్ మెరుపులు అదనం అవుతాయి. ముఖ్యంగా గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో 151 స్ట్రయిక్ రేట్‌తో 265 రన్స్ సాధించాడు. భువీ, హేజిల్ వుడ్ పేస్ అటాక్‌ను ఎదుర్కొని పరుగులు సాధించాల్సి ఉంటుంది. ఇక రబడ, ప్రసిద్ధ్, సిరాజ్, అశోక్ రూపంలో పేస్.. రషీద్, సుందర్‌రూపంలో స్పిన్ వైవిధ్యం జీటీకి అండగా ఉంది.

**హెడ్ టు హెడ్**

ఇరుజట్లు ముఖాముఖిగా ఆరుసార్లు తలపడగా, మూడేసి విజయాలతో సమవుజ్జీగా ఉన్నాయి. చివరిసారి ఈ రెండు జట్లు తలపడినపుడు గుజరాత్ టైటాన్స్ నెగ్గింది.


**పిచ్ రిపోర్ట్**

బెంగళూరులోని చిన్నస్వామిస్టేడియంలో చక్కని బ్యాటింగ్ ట్రాక్ పిచ్ ఉంది. బ్యాట్ పైకి బంతి వస్తుంది కాబట్టి బ్యాట్స్‌మెన్ అలవోకగా షాట్లు ఆడగలుగుతారు. ఈ సీజన్‌లో ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు జరగగా, సగటు స్కోరు 193 రన్స్. మూడు మ్యాచ్‌ల్లో ఛేజింగ్ జట్టే గెలుపొందింది.

**జట్ల వివరాలు(అంచనా)**

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్:** విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్(కెప్టెన్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, షెఫర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, రసిఖ్ సలామ్, సుయాష్ శర్మ, హేజిల్ వుడ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** పడిక్కల్

**గుజరాత్ టైటాన్స్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, హోల్డర్, షారుక్ ఖాన్, రషీద్ ఖాన్, మహ్మద్ సిరాజ్, రబడ, ప్రసిద్ధ్ కృష్ణ, అశోక్ శర్మ; **ఇంపాక్ట్ ప్లేయర్:** తెవాటియా.



**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్**

| | |
|---|---|
| ఆర్సీ బెంగళూర్ V/S గుజరాత్ టైటాన్స్ | రాత్రి 7.30 |

# పాక్ సూపర్ లీగ్ ఫ్లాప్

*భారత్‌లో కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఓ జాతరలా జరుగుతోంది. సెంచరీల మోత, సిక్స్‌ల ధనాధన్‌లతో స్టేడియాలు దద్దరిల్లుతున్నాయి. క్రికెట్ ప్రేమికులు వేసవి సాయంత్రాలను బాగా ఆస్వాదిస్తున్నారు. మరోవైపు పొరుగు దేశంలో పోటీగా నడిపిస్తున్న పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో సీన్ రివర్స్. ఖాళీ స్టేడియాల్లో మ్యాచ్‌లు. ఏవో సాకు చెప్పి తప్పించుకుంటున్న ఫారెన్ ప్లేయర్లు. పీసీఎల్ మొక్కుబడిగా మారింది. ఐపీఎల్‌కు పోటీగా తెచ్చిన పీఎస్ ఎల్‌కు పాకిస్థానీయుల నుంచే ఆదరణ లభించడం లేదు.వారు కూడా ఐపీఎల్‌కు మొగ్గుతున్నారు. దీంతో పాకిస్థాన్ సూపర్ లీగ్ రెంటికి చెడ్డ రేవడైంది.*

**(వార్త క్రీడా విభాగం)**

పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం సామతలా ఉంది పాకిస్థాన్ సూపర్ లీగ్ దుస్థితి. ఐపీఎల్‌లో పాక్ క్రికెటర్లకు చోటు లేకపోవడంతో పోటీగా పీఎస్ఎల్‌ను తీసుకువచ్చింది. పీఎస్ఎల్‌ను 2015లో ప్రకటిస్తే... ప్రారంభమవడానికే ఏడాది తీసుకుంది. అదీ పాక్‌లో కాకుండా 2016లో యుఏఈ గడ్డపై చచ్చీచెడీ అయిదు జట్లతో ప్రారంభమైంది. అయిదు నుంచి ఎనిమిది జట్లకు పెంచేందుకు పదేళ్లు తీసుకుంది. పీఎస్ఎల్‌లోని జట్లు...హైదరాబాద్ కింగ్స్‌మెన్, ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖాలండర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్, రావల్పిండిజ్. కొందరు విదేశీ క్రికెటర్లను, అదీ ఐపీఎల్ తీసుకోనివారిని ఏరుకుని తీసుకున్నారు. పదేళ్లు అలా లాగుకొచ్చారు.

ఐపీఎల్ మార్చి 28న ప్రారంభమైతే... దీనికి పోటీగా పీఎస్ఎల్‌ను రెండు రోజుల ముందే(మార్చి 26) పీఎస్ఎల్‌ను దాయాది ప్రారంభించింది. ఐపీఎల్‌కు సమాంతరంగా మే 3 వరకు పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను నిర్వహిస్తోంది. అయితే పేరులోనే సూపర్ కానీ, నిర్వహణలో అంతా ఫ్లాప్. నిర్వాహకులు, బ్రాడ్‌కాస్టర్లు, ఫ్రాంచైజీలు ఊహించిన స్థాయిలో పీఎస్ఎల్‌కు ఆదరణ లభించడంలేదు. దీంతో పీఎస్ఎల్ నుంచి విదేశీ క్రికెటర్లు ఒక్కొక్కరుగా మొఖం చాటేస్తున్నారు. ఏదో సాకు చూపి స్వదేశానికి చేరుకుంటున్నారు.

అభిమానులు కూడా పీఎస్ఎల్‌కు దూరమవుతున్నారు. దీంతో పీఎస్ఎల్ ఫ్లాఫ్‌గా మారింది.

**తెలుపు టూ గులాబీ**

ఇక పీఎస్ఎల్ మొదటి మ్యాచ్ ప్రారంభమైన కొద్ది క్షణాలకే తెల్ల బంతి గులాబీ రంగులోకి మారింది. హైదరాబాద్ కెప్టెన్ లబూషేన్ కూడా ఆశ్చర్యపోయాడు. ఇక పాకిస్తాన్ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ అయితే హైదరాబాద్ కింగ్స్‌మెన్ కిట్‌ను ట్రోల్ చేస్తూ, "దుపట్టా గల్లీ" అని ఎగతాళి చేశారు.

**ఖాళీ స్టేడియాలు**

సిక్స్‌లు బాదినపుడు, వికెట్ల పడ్డప్పుడు స్టేడియంలో ప్రేక్షకుల కేరింతలకు హద్దుండదు. ఐపీఎల్ మ్యాచ్‌లపుడు స్టేడియాలు హోరెత్తుతుంటే.. పీఎస్ఎల్‌లో దీనికి రివర్స్‌గా ఉంది. ఖాళీ స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తుండడంతో నాచురల్ క్రికెట్ మజా పోతోందని ఆవేదన చెందుతున్నారు. స్టాండ్స్‌లో అభిమానుల కేరింతలు లేకపోవడంతో, ఈ పీఎస్ఎల్ "తక్కువ ఇంధనంతో" నడుస్తున్నట్లుగా ఉంది. ముల్తాన్, పెషావర్, ఫైసలాబాద్, కరాచీ, రావల్పిండి, లాహోర్ నగరాల్లో మ్యాచ్‌లు నిర్వహించాలని మొదట్లో ప్రణాళిక చేసినా.. ఇరాన్–అమెరికా యుద్ధం వల్ల వచ్చిన ఇంధన కొరత తంటాతో కరాచీ, లాహోర్‌లకే మ్యాచ్‌లను పరిమితం చేశారు. అదీ ఖాళీ స్టేడియాలతో నిర్వహిస్తున్నారు. దీంతో పీఎస్ఎల్ రెంటికి చెడ్డ రేవడిలా మారింది.

**ప్రసార నాణ్యత నిల్**

పీఎస్ఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సొంత అభిమానుల నుంచే ఆగ్రహం వ్యక్తమవుతోంది. పీఎస్ఎల్ 2026 విఫలం కావడానికి నిస్సార మ్యాచ్‌లు ఓ కారణమైనా.. ప్రధాన కారణం మాత్రం ప్రసార నాణ్యతా ప్రమాణాలు నాసిరకంగా ఉండడమే. సరైన కోణాలు లేకుండా, మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేస్తున్నట్లు అనిపిస్తోందని క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరాచీ కింగ్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ కూడా ఇలాగే ఫీలవుతున్నాడు. దీంతో పాక్ క్రికెట్ ప్రేమికులు కూడా పీఎస్ఎల్ పక్కనపెట్టి ఐపీఎల్ మ్యాచ్‌లను ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో ఐపీఎల్ వ్యూయర్‌షిప్ రికార్డులు నెలకొల్పుతోంది.




## రెండోసారి శతక్కొట్టిన సంజూ

**ముంబై:** టీ20 ప్రపంచకప్ హీరో సంజూ శాంసన్ మరోసారి శతక్కొట్టాడు. ఈసారి ముంబై ఇండియన్స్ బౌలర్లు బలయ్యారు. వాంఖడేలో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో అలరించాడు. ముంబై బౌలర్లను తనదైన శైలిలో ఉతికారేశాడు. కేవలం 54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. పవర్ ప్లేలో ధాటిగా ఆడిన సంజూ.. 26 బంతుల్లో 6 ఫోర్లు, మూడు సిక్స్‌ల సహాయంతో అర్ధసెంచరీ సాధించాడు. మధ్యలో వికెట్లు వేగంగా పడడంతో నెమ్మదించిన సంజూ స్లాగ్ ఓవర్లలో మరోసారి జూలు విదిల్చాడు. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన సంజూ.. బుమ్రా ఓవర్లో ఫోర్, భగత్ ఓవర్లో తొలి బంతికి సిక్స్‌ర్‌తో తొంభైలోకి వచ్చాడు. అదే ఊపులో బంతిని రెండు సార్లు స్టాండ్స్‌లోకి పంపిన శాంసన్ సెంచరీతో పాటు చెన్నై స్కోర్ రెండొందలు దాటించాడు. రెండో ఫిఫ్టీకి 28 బంతులు తీసుకున్నాడు. సంజూ విధ్వంసంతో చెన్నై నిర్ణీత ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 207పరుగులు చేసింది. సంజూ శాంసన్‌కు ఈ సీజన్‌లో రెండో సెంచరీ కాగా, ఓవరాల్‌గా 5వ ఐపీఎల్ సెంచరీ. ఈ క్రమంలో శాంసన్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించాడు. ముంబై ఇండియన్స్‌పై సెంచరీ చేసిన మొట్టమొదటి సీఎస్‌కే బ్యాటర్‌గా శాంసన్ నిలిచాడు. అదేవిధంగా చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఒకే సీజన్‌లో రెండు సెంచరీలు చేసిన మొదటి భారత బ్యాటర్‌గా సంజూ రికార్డు నెలకొల్పాడు. ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో కెఎల్ రాహుల్‌తో కలిసి నాలుగో స్థానంలో శాంసన్ నిలిచాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలి శతకం కూడా సంజూ బ్యాట్ నుంచే వచ్చింది. అంతకుముందు మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన సంజూ... సెంచరీతో పరుగుల ట్రాక్‌లో పడ్డాడు. ఆ తర్వాత కూడా విలువైన పరుగులతో సీఎస్‌కే విజయాల్లో కీలక పాత్ర పోషించిన సంజూ... ఈమ్యాచ్‌లోనూ చివరివరకూ అజేయంగా నిలిచాడు. ఆ తర్వాత లక్ష్య ఛేధనలో ముంబై మరోసారి ఘోరంగా విఫలమైంది. వెంటవెంటనే వికెట్లు కోల్పోయి స్వల్ప పరుగులకు పరిమితమైంది. దీంతో సీఎస్‌కే ఖాతాలో మూడో విజయం చేరింది.



## ఐదేళ్లలో 25వేలమందికి పైగా..

# పెరుగుతున్న మిలియనీర్లు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** భారత్‌లో 30 మిలియన్ డాలర్ల విలువైన సంపద పెరిగిన అల్ట్రా రిచ్ ప్రముఖులు 19,877మంది ఉన్నట్లు తేలింది. వీరి సంఖ్య 2031 నాటికి25,217కు కూడా పెరుగుతుందని నైట్‌ఫ్రాంక్ వెల్త్‌రిపోర్ట్‌లో అంచనావేసింది. ప్రపంచ వ్యాప్త అల్ట్రా నెట్‌వర్త్ ఇండివిద్యుయల్స్ 2026 నివేదిక ప్రకారం చూస్తే గ్లోబల్ స్థాయిలో 2.8శాతం వాటాతో ఉంది. అంతకుముందు ఐదేళ్లక్రితం 2శాతం మాత్రమే ఉంది. ప్రస్తుతం దేశాలవారీగాచూస్తే అమెరికా అగ్రస్థానంలో ఉంది. అమెరికాలో 914, మెయిన్‌ల్యాండ్‌చైనాలో 485, భారత్‌లో 207 మంది బిలియనీర్ల జనాభా ఉంది. అదే అల్ట్రారిచ్ 30 మిలియన్ డాలర్లకుపైబడిన వారు అమెరికాలో 2,51,352, మెయిన్‌ల్యాండ్‌చైనా 1,21,677, యుకెలో 27,876మంది.. జర్మనీలో 38,215 మంది.. ఫ్రాన్స్‌లో 21,518 మంది, భారత్‌లో 19,877 మంది, జపాన్‌లో 18,914మంది, స్విట్జర్లాండ్‌లో 17,692 మంది, ఆస్ట్రేలియాలో 16,460 మంది, ఇటలీలో 15,433 మంది ఉన్నట్లు తేలింది. నైట్‌ఫ్రాంక్ అంచనాలప్రకారం భారత్ గ్లోబల్ వెల్త్ హబ్‌గా శరవేగంగా వృద్ధి చెందుతున్నట్లు తేలింది.

2021-26 మద్యకాలంలో భారత్‌లో అల్ట్రా రిచ్ ప్రముఖుల జనాభా 63.4శాతంపెరిగింది. ప్రపంచ వ్యాప్తంగాచూస్తే వీరి సంఖ్య 5లక్షల 51వేల 435నుంచి 7,13,626కి పెరిగింది. సగటున కొత్తగా అల్ట్రారిచ్ పర్సన్లను 89 మంది చొప్పున పెరుగుతున్నారు. అదే భారత్‌లో 2031 నాటికి భారత్‌లో 313మంది బిలియనీర్లు ఉంటారని తేలింది. ఐదేళ్లలోనే 51శాతం పెరుగుదల నమోదవుతుంది. ప్రపంచ స్థాయిలో 3110 మంది బిలియనీర్లు ఉన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే 1116మంది ఉన్నారు. ఉత్తర అమెరికా ప్రాంతంలో 965 మంది ఉన్నట్లు నైట్‌ఫ్రాంక్ వివరించింది. ఇక భారత్ పరంగా ముంబై అగ్రస్థానంలో ఉంది. తర్వాత ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలు అల్ట్రారిచ్ ప్రముఖులున్నట్లు తేలింది. ముంబయిలో 35.4శాతం, ఢిల్లీలో 22.8, బెంగళూరు 10.6, హైదరాబాద్ 6.3, చెన్నైలో 4.8శాతం మంది పెరిగినట్లు తేలింది. వారసత్వ వ్యాపారాలు భారీస్థాయిలో వృద్ధిచెందుతుండటం వల్లనే మిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది. వచ్చే ఐదేళ్లలో భారత్‌లో హైనెట్‌వర్త్ ఇండివిద్యుయల్స్ వృద్ధి 26.9శాతంగా, అమెరికాలో అయితే 54.1శాతం, చైనాలో 18.8 శాతం వృద్ధిచెందుతారని నైట్‌ఫ్రాంక్ అంచనా వేసింది. టెక్నాలజీ, ఉత్పత్తిరంగం, ఆర్థికసేవలు, రియల్‌ఎస్టేట్, కన్స్యూమర్ బిజినెస్‌లలోనే అల్ట్రా రిచ్ పెరుగుతున్నట్లు సర్వేలో తేలింది.

## 720 కోట్లతో సైయింట్ షేర్ బైబాక్

**ముంబయి, ఏప్రిల్ 22:** గ్లోబల్ ఇంటెలిజెంట్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సొల్యూషన్‌నకంపెనీ సైయింట్ రూ.720 కోట్ల షేర్ల బైబాక్‌ను ప్రకటించింది. ప్రతి వాటాను రూ.1125 చొప్పున కొనుగోలుచేస్తామని మొత్తం 64 లక్షల షేర్లను బైబాక్ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజిలకు వెల్లడించింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎండి బోదనపు కృష్ణ మాట్లాడుతూ బోర్డు డైరెక్టర్లు తమ బిజినెస్‌పై ఎంతో ధీమా ప్రకటించారని, ఈక్విటీ షేర్ల బైబాక్‌ను ఆమోదించారన్నారు. టెండర్ ఆఫర్ ద్వారా రూ.1125 చొప్పున 720 కోట్లను అధిగమించకుండా ఈ షేర్ల బైబాక్ ఉంటుందని వెల్లడించారు. ఇందుకు గాను కంపెనీ వద్ద క్యాష్‌ఫ్లో పుష్కలంగా ఉందన్నారు. మా నాయకత్వ టీమ్‌పై నాకు ఎంతో నమ్మకం ఉందని, దీర్ఘకాలికంగా కూడా కంపెనీ లాభదాయకత లక్ష్యంగా ముందుకు వెళుతుందని ఎండి అన్నారు. ఇక నాలుగోత్రైమాసికంలో కంపెనీ నికర లాభాలు 40.3శాతం క్షీణించి 54.8కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు త్రైమాసికంలో 91.8




కోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే రాబడులు మాత్రం 4.2శాతం పెరిగాయి. 1849 కోట్లనుంచి రూ.1927 కోట్లకు పెరిగాయి. వడ్డీ, పన్నులచెల్లింపులకుముందు లాభాలు కూడా 156 కోట్లుగా ఉన్నాయి. ఎబిడిట్ మార్జిన్ 9.03 నుంచి 8.08శాతానికి చేరింది. సైయింట్ స్టాక్ 2.7శాతం దిగువన ఎన్ఎస్ఇలో గురువారం 935.90గా ట్రేడ్ అయింది.

## 33 పైసలు క్షీణించిన రూపీ



**ముంబయి, ఏప్రిల్ 23:** డాలరుతో రూపాయి మారకం విలువలు 33 పైసలు దిగువన ట్రేడ్ అయింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ కరెన్సీ కౌంటర్‌లో గురువారం డాలరుతో రూపాయి చెలామణి 94.11గా నమోదయింది. 33పైసలు క్షీణించినట్లు తేలింది. వరుసగా రెండోసారి 94 స్థాయిని బ్రేక్‌చేసింది. ముడిచమురుధరలు పెరుగుదల, పశ్చిమాసియా శాంతి చర్చలు అనిశ్చితిలోకి వెళ్లడం వంటివి రూపాయి చెలామణిపై ప్రభావంచూపించాయి. దేశీయ ఈక్విటీల్లో కూడా కొన్ని రంగాల్లో భారీ విక్రయాలు, విదేశీ నిధులు పెద్దమొత్తంలో విత్‌డ్రా వంటివి ప్రపంచ వ్యాప్తంగా అమెరికన్‌కరెన్సీ డాలర్‌కు డిమాండ్‌ను పెంచాయి. వారంరోజుల్లోనే ఒకటిశాతం క్షీణించిందని ఫోరెక్స్ డీలర్లు చెపుతున్నారు. గురువారం ఉదయం ప్రారంభంలో94.03వద్దప్రారంభమై ఇంట్రాడే లో మరింతగా క్షీణించి 94.17వద్దకు చేరింది. ముగింపునాటికి 94.11కంటే మొందు ఒకదశలో 93.98గా కూడా పలికింది. చివరకు 94.11వద్ద ట్రేడింగ్‌ముగిసింది. ముందురోజు బుధవారం డాలర్ రూపాయి చెలామణి 93.78గా నడిచింది. గడచిన నాలుగు సెషన్లలో దేశీయ కరెన్సీ 120 పైసలు నష్టపోయింది. అంటే 1.3శాతం క్షీణించింది. ఈనెల17వ తేదీ 92.91గా నమోదయినప్పటినుంచి ఒడిదుడుకులు వస్తున్న రూపాయి నష్టపోతూ వచ్చింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభంనుంచి కూడా రూపాయి చెలామణి 94బ్రేక్‌చేసింది. అదే గతనెల 30 తేదీ అత్యంత తక్కువ ఇంట్రాడే స్థాయి అంటే 95.22గా నమోదు చేసింది. తర్వాత ఆర్బీఐ చేపట్టిన కఠిన కార్యాచరణతోరూపాయి కొంత మెరుగుపడింది. ఇక బ్రెంట్‌ముడిచమురు పరంగా చూస్తే 1.88శాతం పెరిగి బ్యారెల్‌కు 103.83 డాలర్లుగా ఫ్యూచర్‌ట్రేడ్‌లో నమోదయింది. రానున్న కాలంలో 93.80 నుంచి 94.50వరకూ పెరగవచ్చని కరెన్సీ మార్కెట్ నిపుణులు చెపుతున్నారు.

# రెండో రోజూ నష్టాల్లోనే స్టాక్ మార్కెట్లు

**ముంబయి, ఏప్రిల్ 23:** భారతీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా నష్టాల్లో ముగిసాయి. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 852 పాయింట్లు, నిఫ్టీ 205 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 852.49 పాయింట్లు 1.09 శాతం నష్టపోయి 77,664 వద్ద ముగిసింది. నిఫ్టీ 205.05 పాయింట్లు అంటే 0.84శాతం నష్టపోయి 24,173.05 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్లు ఒత్తిడిలోనే కొనసాగాయి. నిఫ్టీ 24,202.35 పాయింట్లతో ప్రారంభంకాగా, ఇంట్రాడేలో 24,134.80 పాయింట్ల కనిష్టానికి చేరింది. ఇరాన్‌అమెరికా మధ్య శాంతి చర్చల అంశంలో స్పష్టత లేకపోవడం, హార్ముజ్ దిగ్బంధనం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం వంటి అంశాలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్ స్టాక్స్ భారీగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, బీఈఎల్, సన్ ఫార్మా, ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్ సంస్థలు లాభాలు పొందాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. బ్యారెల్ ముడిచమురు ధర 103.65 డాలర్ల వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 4688 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత పడిపోయింది. 94 మార్క్ దాటి 94.12 వద్ద కొనసాగింది. రెండురోజుల్లోనే సెన్సెక్స్ 1,600 పాయింట్లు (2 శాతం)నష్టపోయింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.93శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.47, రిలయన్స్ 1.45శాతం చొప్పున నష్టం చవిచూసాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.33శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.49శాతం క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1762 కంపెనీల షేర్లు పెరిగితే 2517 షేర్లు నష్టాలు చవిచూసాయి. 1177 షేర్లుమాత్రమే ఎలాంటి కదలికలేకుండా స్థిరంగా కొనసాగాయి. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,51,589కి చేరాయి. ఇక షేర్లపరంగా ఇన్ఫోసిస్ 2.04 శాతం, ట్రెంట్ 4.21 శాతం, ఇండస్ టవర్స్ 0.86శాతం, సంగం ఇండియా 1.15 శాతం క్షీణించాయి. ఇక ఫార్మారంగంలో స్పెషాలిటీ మెడిసిన్స్ షేర్లు ఐదుశాతం ఎగువన ట్రేడ్ అయ్యాయి.

## సెన్సెక్స్,నిఫ్టీలపై వార్ ఒత్తిళ్లు




## ఫార్మా మార్కెట్‌లో ఆ మూడు మందులే ఎక్కువ!

**ముంబయి, ఏప్రిల్ 23:** అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ ఉన్న మందుల విక్రయాలే ఎక్కువ అమ్ముడవుతున్నట్లు సర్వేల్లో తేలింది. భారత ఫార్మారంగ మార్కెట్లలో ఈ మొండి వ్యాధులకు ఈమందులే ఎక్కువ విక్రయం అవుతున్నాయి. వరుసగా నాలుగోనెలలో కూడా ఈ రంగం రెండంకెల వృద్ధిలో ఉందంటే ఇవే కారణమని తేలింది. భారత్ ఫార్మారంగ మార్కెట్ ఈ ఏడాది మార్చినెలలో 10.7శాతం వృద్ధినమోదుచేసింది. వరుసగా నాలుగో నెలలో కూడా వృద్ధినమోదయిందని ఈక్విరస్ సెక్యూరిటీస్ అంచనావేసింది. వార్షిక పద్ధతిలోచూస్తే 12 నెలల వృద్ధి 9.9శాతంగా ఉంది. గడచిన ఐదు త్రైమాసికాలతోపోలిస్తే పటిష్టంగా ఉందని అంచనా. రోజువారి వినియోగంలో ఉన్న మందులు హైపర్‌టెన్షన్, డయాబెటిక్స్, అధిక కొలెస్ట్రాల్ మందుల కొనుగోళ్లలో 40.4శాతం మార్కెట్ వాటాతో ఉన్నాయి. ఏడాది క్రితం 39శాతం ఉంటే 610 బేసిస్ పాయింట్లు పెరిగాయి. తీవ్ర స్థాయి చికిత్సల్లోకూడా వీటికే అధికభాగం ఉంది. కార్డియాక్ మందుల సెగ్మెంట్ మొత్తం అమ్మకాల్లో 14శాతంగా ఉంది. మార్చిలో 14.9శాతానికి పెరిగింది. ఇక యాంటీ డయాబెటిక్ చికిత్స మందులు కూడా 14.2శాతం పెరిగాయి. ఈ రంగంలో పరిమాణం, ధరలు, కొత్త ఉత్పత్తుల ప్రవేశం వంటివి పెరిగినట్లు తేలింది. ఇక యాంటి డయాబెటిక్ మందుల కంపెనీలు పదిలో ఏడు కంపెనీలు బ్రాండెడ్ జనరిక్స్ విడుదల చేసాయని తేలింది. వీటిలో టొరెంట్ గతనెలలో 35 మిలియన్ రూపాయల విక్రయాలు జరిపింది.






## ఇన్ఫోసిస్ నికరలాభం రూ.8501కోట్లు

**బెంగళూరు, ఏప్రిల్ 23:** టెక్నాలజీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ నాలుగో త్రైమాసికంలో నికర లాభాలు 28శాతం వృద్ధిని నమోదుచేసింది. మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.8501 కోట్ల నికరలాభం అర్జించినట్లు ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో 6654కోట్లు ఆర్జించిన సంస్థ 28శాతం వృద్ధి సాధించినట్లు తెలిపింది. రాబడులు కూడా 2శాతం పెరిగాయి. రూ.46,402 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. మొత్తం కాంట్రాక్టుల విలువలు కూడా సంస్థకు 3.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని మొత్తం ఏడాదికాలానికిగాను 14.9 బిలియన్ డాలర్ల కాంట్రాక్టు ప్రాజెక్టులు చేతిలో ఉన్నాయని వివరించింది. ఇన్ఫోసిస్ రాబడుల నివేదికలో నికరంగా కొత్తగా 55శాతం పెరిగినట్లు తెలిపింది. 2027 ఆర్థికసంవత్సరంలో 1.5 నుంచి 3.5శాతం రాబడుల వృద్ధి ఉంటుందని, నిర్వహణ మార్జిన్ ఈ ఆర్థికసంవత్సరంలో 20నుంచి 22శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. ఇన్ఫోసిస్ ప్రతి షేరుకు రూ.25 డివిడెండ్ ప్రకటించింది. తుదివిడత డివిడెండ్ ఈ ఏడాది జూన్10నుంచి చెల్లింపులు ఉంటాయని, చివరిగా జూన్ 25వ తేదీకి పూర్తవుతుందని తెలిపింది. కంపెనీనుంచి వైదొలుగుతున్న ఉద్యోగుల సంఖ్యకూడా 12.6శాతంగా ఉంది. డిసెంబరు త్రైమాసికంలో 12.3శాతంనుంచి కొంతమేర పెరిగింది. ఎంటర్‌ప్రైజ్ ఎఐ విలువలు మార్కెట్ వాటాను పెంచాయని కంపెనీవివరించింది. మొత్తం ఆరు విభాగాల్లో ఎఐసేవలు వ్యూహాత్మకంగా పెరిగాయని, ఎఐ భాగస్వామ్యాలు మరింత వృద్ధిని తెచ్చాయని సిఇఒ ఎండి సలీల్‌పరేఖ్ అన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.